# 1

# పురుషోత్తము చౌధరి

## విహంగ వీక్షణం

## ఆంధ్ర క్రైస్తవ భక్తి సాహిత్య పితామహుడు

**1803 - 1890**

పురుషోత్తము చౌధరీగారి కీర్తనలను పాడని తెలుగు సంఘం లేదు! ఆంధ్ర క్రైస్తవ కీర్తనల పుస్తకంలో 70 కీర్తనలున్నాయి. అన్నీ గాక పోయినా, సగానికి పైగా అందరికి కంఠతవచ్చు. 'యెహోవ నా మొఱ లాలించెను.." "ఉన్నపాటున వచ్చుచున్నాను.." "నన్ను గన్నయ్యరావె నాయేసు.." "మంగళమే యేసునకు మనుజావతారు నకు..." "యేసునాథ కథాసుధారసమిదిగో పానము సేయరే.." "వినరే యో నరులారా వీనులకింపు మీర.." "చూడరే క్రీస్తుని జూడరే నా సఖులారా.." ఇత్యాది కీర్తనలను వ్రాసి శ్రోతల హృదయాలలో నిద్రాణంగా ఉన్న భక్తి తత్పరతను జాగృతం చేసిన నవయుగ వైతాళికుడు పురుషోత్తముడు.

తన ముప్పైయవ ఏట భక్తి సాహిత్యానికి శ్రీకారం చుట్టాడనుకొంటే 170 సంవత్సరాల కాలప్రవాహంలో ఆ సాహిత్యం పటిష్టంగా నిలిచి ఉందంటే ఆ కవిత్వంలోని విశిష్టత, ప్రశస్తత, కవి హృదయంలో జనించిన దీక్ష అలాంటివి. క్రీస్తును రక్షకునిగా స్వీకరించిన తర్వాత సమాజంలో ఎన్నో తాకిళ్లకు గురయ్యాడు. స్వచ్ఛమైన బ్రాహ్మణుడై యుండి క్షుద్రజాతు లవలంభించిన క్రైస్తవమతంలో చేరిపోవడాన్ని ఆనాటి తోటి బ్రాహ్మణ సమాజంగానీ, అగ్రవర్ణ అధికారంగానీ సహించలేదు. తాను విశ్వసించిన క్రీస్తుకోసం తానాశించిన రక్షణమార్గం కోసం ఎంత బాధనైనా భరించాడు; ఎంత శ్రమనైన సహించాడు; ఎలాంటి నిందలనైన మోసాడు.

ఆయన కేవలం కవి మాత్రమే కాదు; ప్రఖ్యాత భక్తాగ్రేసరుడు.

చిత్రమేమిటంటే, అందరూ అనుకొన్నట్టు ఆయన తెలుగువాడు కాదు. వంగదేశస్తుడు! కొన్ని రాజకీయ కారణాలవల్ల బెంగాలు నుంచి ఒరిస్సాకు వలస వెళ్లిన బ్రాహ్మణ కుటుంబాలలో వీరిదొకటి. ఒరిస్సాకు ఆంధ్రకు సరిహద్దులో ఉన్న పర్లాకిమిడి రాజునాశ్రయించి అక్కడే ఆస్థానకవుల్లా స్థిరపడిపోయారు. పర్లాకిమిడి సరిహద్దు నగరం గనుక తెలుగు భాషను నేర్చుకొని అందులో నిష్ణాతులయ్యారు. సంస్కృతాంధ్ర భాషల్లో ఎనలేని పాండిత్యాన్ని సంపాదించారు.

పురుషోత్తముని బాల్యం బ్రాహ్మణ సాంప్రదాయ పరంపరలో కొనసాగింది. తండ్రి కూర్మనాథ చౌధరీ, తల్లి సుభద్రాదేవి. తమ ద్వితీయ పుత్రుడైన పురుషోత్తమున్ని హైందవాచార రీతిలో ఏ లోటూ లేకుండా పెంచారు. తండ్రి కూర్మనాథుడు కూడా ప్రసిద్ధిగాంచిన పండితుడు. పురాణాలు, ఇతిహాసాలు, భారతం, భాగవతం ఇత్యాది గ్రంథాలను 14వ యేట నుంచే అభ్యసింపజేశాడు. వైష్ణవునిగా శ్లోకాలు, మంత్రాలు నేర్పించాడు. అందువల్ల పురుషోత్తముడు వైష్ణవ భక్తునిగా రూపొందాడు. జపాలు, పవిత్ర స్నానాలు,ఉపవాసాలు, తీర్థయాత్రలు చేసేవాడు. వైష్ణవ గీతాలు పాడుతూ వీధుల వెంబడి తిరిగేవాడు. ఆ రోజుల్లోనే శ్రీరామ శతకాన్ని వ్రాశాడు. ఆ తర్వాత శివ భక్తుడయ్యాడు. ఇంతగా హైందమతంలోనూ, మతాచారాలలోను కూరుకుపోయిన వ్యక్తి క్రీస్తు చెంత చేరడం విచిత్రమనిపిస్తుంది. దీనికి ప్రబలమైన కారణం లేకపోలేదు.

ఇంత భక్తి వైరాగ్యంలో ఎదిగినా పురుషోత్తమునికి మనశ్శాంతి కరువైంది. శాంతిని వెదుకుతూ వైష్ణవ, శైవ మతాలను నిరసించి రాజయోగ మఠంలో చేరాడు. కుటుంబాన్నీ భార్య రాధామణినీ బిడ్డల్నీ, బంధువులను, విడనాడి సన్యాసత్వాన్ని స్వీకరించి సన్యాసుల్లో కలిసిపోయాడు. ఆధ్యాత్మిక చింతన మినహా మరొకటి లేకుండా జీవించసాగాడు కాని... అప్పటికీ తానాశించిన శాంతి లభించలేదు. అయితే అతని అన్వేషణ ఆగిపోలేదు.

చివరకు తన అన్నగారైన జగన్నాథ చౌధరి ద్వారా ఒక కరపత్రం లభించింది. ఆ రోజుల్లో విశాఖపట్నంలో సేవ చేస్తున్న మిషనరీలు వ్రాసిన పత్రం, ***"క్రీస్తు మత గురువులు ఈ సీమ సమస్త జనులకు వ్రాసిన పత్రిక".*** దాన్ని చదివి క్రీస్తును గురించి తెలుసుకోవాలనే తాపత్రయంలో కొన్ని వందలమైళ్ళు కాలినడకన ప్రయాణంచేసి విశాఖ చేరుకొన్నాడు. అక్కడ శ్రీమతి నాట్ అనే దొరసాని గారిని కలుసుకొన్నాడు. ఈమె పురుషోత్తమునకు

తల్లిలాంటిది. యేసుక్రీస్తు సువార్తను, అందులోని సత్యాలను, విశ్వాసాన్ని ఆమె చౌధరికి వివరించింది. తానొక బైబిలు గ్రంథాన్ని కూడా సంపాదించుకొని పరిశుద్ధ గ్రంథ పారాయణం ప్రారంభించాడు. ఇది తన జీవితానికొక మలుపునిచ్చింది. తాను అన్వేషించిన శాంతి ఎట్టకేలకు యేసుక్రీస్తు ద్వారా లభించింది. యేసు క్రీస్తే నిజమైన దేవుడని తను త్రికరణ శుద్ధిగా నమ్మిన తర్వాత 1833లో కటక్‌లో ఉన్న గంగా మందిరం అనే కోనేటిలో చార్లెస్ లెస్సీ అనే మిషనెరీ ద్వారా అక్టోబర్ 6వ తేదీన బాప్తిస్మం పుచ్చుకొన్నాడు. ఆనాడు తన కులాన్ని, మతాన్ని, జంద్యాన్ని త్యజించి బహిరంగంగా క్రైస్తవ మతాన్ని స్వీకరించాడు. కటక్ పట్నంలో ఉన్న సంఘం ఎదుట "మా యేసు క్రీస్తుని మఱుగు కల్గెనురా – నా యాత్మ ఘన రక్షా నగము నెక్కెనురా" (ఆం.క్రై.కీ. 490) అనే కీర్తన పాడారు. ఇది వారి ప్రథమ కీర్తన. ఇందులో ఆరు చరణాలున్నాయి. వాటన్నిటిని శ్రద్ధగా చదివితే తానెందుకు క్రైస్తవుడయింది విదితమౌతుంది. సువార్త తనపై ఎలాంటి ప్రభావాన్ని చూపిందో వివరించి దాన్ని రెండవ చరణంలో పేర్కొంటారు "సువిశేష బోధ నా చెవులాలించెనురా – అవివేక శాస్త్రోక్తులంటు వీడెనురా – నవ సత్క్రైస్తవ గోష్టి సత్ క్రైస్తవ భువి నా కబ్బెనురా – వివిధములను వేల్పుల్విషమైరి గదరా" !!

తదాదిగా 190 కీర్తనలు రచించారట. కీర్తనల పుస్తకంలో 70 కీర్తనలు మాత్రమే ఉన్నాయి. మిగిలినవి అలభ్యాలు. అందులో కొన్ని ఇటీవల వెలుగులో కొచ్చాయి. క్రీస్తును విశ్వసించిన తర్వాత హైందవ సాహిత్యాన్ని పూర్తిగా విడనాడి క్రైస్తవ సాహిత్యాన్ని చేపట్టి ఉత్తమ గ్రంథాలను రచించారు. వీటిలో కొన్నింటినైనా పేర్కొని తీరాలి. వాటిని ఇలా వర్గీకరించవచ్చు.

**గ్రంథాలు** : బైబిలు నిఘంటువు; దైవిక శాంతి మార్గము; ప్రసంగమాలిక (ఒరియా); తీర్పు దినముపై ప్రసంగం.

**కరపత్రాలు** : కులాచార పత్రిక (1833); ముక్తిమార్గ ప్రదర్శనం (1833); జగన్నాథ పరీక్ష (1833); బ్రహ్మజ్ఞానం (1853); అంధకార నాశనం (1861) మశూచి, విశూచి సంకట భ్రాంతి నివృత్తి (1863); మనస్సే మూలం (1863)

**పద్యకావ్యాలు** : యేసునాయక శతకం (1845); యేసుక్రీస్తు ప్రభు శతకం (1845); రక్షణ చరిత్ర (1846); నిస్తార రత్నాకరం (1846); పంచచామర పన్నములు (1847); క్రైస్తవ నీతి ప్రకాశం (1861); సత్యవేద సార సంగ్రహం (1871); సత్భజన (1874);

పంచరత్నములు (1847); దేవుని విరూప్రూప వర్ణనం (1884).

ఇంత విస్తృతంగా ఇంత వైవిధ్యమున్న రచన చేసిన వారుగాని పండితుల్నీ, పామరుల్నీ ఆకట్టుకొనే రీతిలో అసంఖ్యాకమైన పద్యాలు, కీర్తనలు, దరువులు వ్రాసిన వారుగాని క్రైస్తవ వాఙ్మయంలో కనిపించరు. ముఖ్యంగా క్రైస్తవ భక్తి సాహిత్యానికి పురుషోత్తముడు చేసిన సేవలు అపారమైనవి; అవి తరగని గనులు ! అందుకే ఈయన తెలుగు క్రైస్తవ భక్తి సాహిత్యానికి పితామహుడు. వీరి రచనలన్నిటినీ సమీకరించి అప్పటికే వర్గీకృతమై ఉన్న మూడు ఘట్టాలతో లాక్షిణికులు కలిపారు. అవి :

1. ప్రథమా ఘట్టం (1408-1503 వరకు) వైష్ణవ భక్తి వెలుగొందిన ఘట్టం. తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలు ప్రచారం పొందినకాలం.

2. ద్వితీయ ఘట్టం (1606-1750) ఇందులో కూడ వైష్ణవ భక్తి కీర్తనలకే ప్రాధాన్యత లభించింది. అయితే వీటిని మధుర భక్తి సాహిత్యంగా ఉదాహరించారు. క్షేత్రయ్య సంకీర్తనలు ప్రాచుర్యాన్ని సంతరించుకొన్నాయి.

3. తృతీయ ఘట్టం (1757-1847) శ్రీరామ భక్తి సాహిత్యానికి విస్తృత ప్రాచుర్యం లభించిన ఘట్టం. త్యాగయ్య కృతికర్తగా వెలుగొందాడు.

4. చతుర్థఘట్టం. ఇందులో క్రైస్తవ భక్తి సాహిత్యానికి ప్రాధాన్యత నిచ్చారు. యేసుక్రీస్తును సంస్మరిస్తూ, ఆయన రక్షణ సువార్తను వివరిస్తూ రచించిన కీర్తనలు, పద్య కావ్యాలకు సాహిత్యపరమైన గుర్తింపు లభించింది. ఆందుకు కారణభూతుడు మహాకవి, కవిసార్వభౌముడు పురుషోత్తము చౌధరి!

ఇదంతా ఎందుకు చెప్పానంటే - కేవలం కీర్తనల పుస్తకంలో ఉన్న కీర్తనలు పాడి పురుషోత్తము చౌధరి గొప్పకవి అని క్రైస్తవ సంఘాలు అనుకోవడమే కాదు. సాహిత్యంలో నిష్ణాతులైనవారూ, పండితోత్తములు లాక్షిణికులు పురుషోత్తముని కవిత మాధుర్యాన్ని, ప్రమాణీకాన్ని, వైవిద్యాన్నీ క్షుణంగా పరిశీలించిన పిదప వారిని ఆ ఉత్తమ కోవలో పరిగణించడం గర్వకారణం. అందులోనూ యేసుక్రీస్తు జీవితం మీద వ్రాసిన కీర్తనలను ప్రామాణికంగా పరిగణించడం అభినందనీయం.

పురుషోత్తము చౌధరీ పలుకు వేరు; పదగుంభనం వేరు, పదలాలిత్యం వేరు. ఈ మహాకవి రచనకు ఉపక్రమిస్తే కలం ఉలిగా మారి అక్షరతోరణాలను చెక్కి, రక్షణమార్గ గవాక్షాన్ని అలంకరించి అందులోకి అందరినీ ఆప్యాయంగా ఆహ్వానించే ఆణిముత్యాలను కురిపిస్తుంది. ఉదాహరణకు :

దురితము లణప వచ్చి- మరణమై తిరిగి లేచి నిరత మోక్షానంద
సుందర మందిరమున కరుదుగ జనె బిరబిర మన మం - దర మా
కరుణా శరనిధి చరణమె - శరణని పోదము....
వినరే యో నరులారా వీనుల కింపు మీర మనల
రక్షింప క్రీస్తు మనుజావతారుడయ్యె వినరే.... (కీర్తన 104)

మదరాసునుంచి బళ్లారివరకు కాలినడకన బయలుదేరి మధ్యమధ్యలో మజిలీలు వేస్తూ ఈ పాటను అనేకచోట్ల పాడి క్రీస్తు జన్మలోని పరమార్థాన్ని లోకానికి ఎరుకపరచారని ఆ ప్రాంతం వారు చెబుతారు.

కవీశ్వరుడు ఎంత ఘనుడైనా మానవమాత్రుడే. తానొకసారి శోధనకు గురై ఒక తప్పిదాన్ని చేశారట. ఆ తర్వాత తను చేసిన పాపానికి విలపిస్తూ, పరితప్త హృదయుడై మూడు రోజుల ఉపవాసముండి మోకాళ్లూని అద్భుతమై కీర్తనొకటి వ్రాశారు. అది :

త్రాహిమాం క్రీస్తునాథ దయ జూడ రావె - నేను -
దేహీ యనుచు నీ పాదములే - దిక్కుగా జేరితినిపుడు.. (కీర్తన 313)

ఈ కీర్తన పాడని ఆంధ్రుడు లేడు! అందరి తరుపున కవి చేసిన ఆక్రందన కీర్తన.

"..... విన్న దనము లేకుండ నీవే నా మదికి ధైర్యమిచ్చి.
యన్నిట రక్షించితివి - నా యన్న నీకు స్తోత్రమహహా.. ॥త్రాహిమాం॥

క్రీస్తు ద్వారా లభించిన క్షమాభిక్షతో ఈ కీర్తన ముగుస్తుంది.

**సరళంగా సాగిన మరోపాటను గమనించండి :**

హద్దులేనట్టి దురాశల - నవివేకినై కూడి యాడితి
మొద్దులతో నింక కూటమి వద్దయ్య వద్దయ్య వద్దయ్య
నన్ను గన్నయ్య రావె నా యేసు... (కీర్తన 377)

ఇలా ఎన్నైనా వ్రాసుకొంటూ పోవొచ్చు ! అన్ని కీర్తనలను వింగడించి వాటిల్లో నిబిడీకృతమైన క్రీస్తు సందేశాన్ని వివరించాలంటే అదొక పరిశోధిత గ్రంథమే అవుతుంది! చౌధరీగారు ఎన్ని సాహిత్య ప్రక్రియలు చేపట్టినా, గద్యాలు, పద్యాలు, కీర్తనలు ఎన్ని వ్రాసినా అవన్నీ సమాంతర ప్రవాహాలే. అందులోని సందేశం ఒక్కటే. యేసుక్రీస్తు లోకరక్షకుడు. పాపాంధకారంలో కొట్టుమిట్టాడుతున్న వారిని సాతాను కబంధ హస్తాల నుంచి రక్షించి మోక్షరాజ్యంలో ప్రవేశాన్ని కల్పించాడు. అలా చెయ్యడానికి తను పాపాత్ములందరి తరపున సిలువ మరణం పొందాడు; ఆయన మరలా లేచి పరలోక భాగ్యాన్ని అందరికీ ప్రసాదించాడు.

ఆయన్ని నమ్ముకోండి; ఆయనే దేవుడు. ఈ సత్యాలే ఆయన రచనల్లో ప్రధానంగా కనిపిస్తాయి.

1803లో జన్మించి 1890లో మరణించారు. ఇప్పటికి సరిగ్గా 200 సంవత్సరాలు దొర్లిపోయాయి. ఆయన తన ముప్ఫయవ యేటనుంచి రాశారనుకున్నా 170 సంవత్సరాల కాల ప్రవాహంలో వారి సాహిత్యం అజేయంగా నిలిచి ఉందంటే అందుకు కారణం వారి సాహిత్యంలో వున్న విశిష్టత; సందేశంలో ఉన్న పటిష్టత. తాను విశ్వసించినదాన్ని ఏ సంకోచం లేకుండా ఎలుగెత్తి చాటి చెప్పిన మేటి వాగ్గేయకారుడు పురుషోత్తము చౌధరి.

చౌధరీ అన్నది కులవాచకం కాదు. ఆ చౌదరీలో వత్తు లేదు. ఛౌ అంటే నాలుగు; ధరీ అంటే భూమి. నాలుగు భూములకు (పరగనాలకు) అధిపతి అని మూలార్థం. నాలుగవ వంతు పన్ను వసూలు చేసేవారు. పురషోత్తము చౌధరీగారు బెంగాలీ శుద్ధ బ్రాహ్మణులు; క్రీస్తును విశ్వసించి క్రైస్తవుడయ్యారు. పర్లాకిమిడిలో దాస్ అంతర్వేది గురువుతో కలిసి పాస్టరుగా చాలా కాలం దివ్యమైన సేవ చేశారు. వారి వంశంలో ఇప్పుడు ఆరవ తరం సంతానం ఆంధ్ర, ఒరిస్సా, తెలంగాణా ప్రాంతాలలో జీవిస్తున్నారు.

మహాకవి, మహాపండితుడు, కవి సార్వభౌమ బిరుదాంకితుడు, బహుభాషాకోవిదుడు, సత్యాన్వేషి, వాగ్గేయకారుడు, సంఘ సంస్కరణకర్త, ప్రతిభావంతుడైన అనువాదకుడు, సాహిత్య లోకంలో ప్రతిభకు ఆకాశమే హద్దులుగా విలసిల్లిన వాడు పురుషోత్తము చౌధరి !

సాహితీ సంప్రదాయాలను వదలని ఆధునిక దృష్టి, సర్వమానవ శ్రేయస్సును ఆకాంక్షించిన విశ్వమానవ దృష్టి, విషపూరితమైన కుల, మత వ్యవస్థల పట్ల ద్వేషపూరితం కాని ఆగ్రహం, తాను నమ్ముకొన్న యేసుక్రీస్తుని దివ్యనామోచ్చరణ, తద్వారా సంప్రాప్తమయిన ముక్తి - అన్నీకలిసి పురుషోత్తము కవి!

పందొమ్మిదో శతాబ్ది పూర్వభాగంలో కలం పట్టి, గళం విప్పిన వాగ్గేయకారుడు. ఒక వంక సనాతన ధర్మం, మరోవంక హేతువాదోద్యమం, బ్రహ్మసమాజం వారి మత సంస్కరణోద్యమం ఇత్యాది ఉద్యమాల ప్రభంజనం వీస్తున్న తరుణంలో - "పలు విధములగు సందియంబుల - వలన బోరాటములచే నేనలసి యిటునటు గొట్టబడి దు-ర్బలుడనై గాయములతో నిదె - .. ఉన్నపాటున వచ్చుచున్నాను నీ పాద సన్నిధికో రక్షకా... కారుణ్య నిధి యేసు - నా రక్షకా.. అని తన సంసిద్ధతను ఎరుకపర్చుతూ శుభ వర్తమానాన్ని ఎలుగెత్తి చాటించడానికి అరహరం శ్రమించి, క్రైస్తవ భక్తి సాహిత్యానికి ఆద్యుడిగా అమరుడైనవాడు పురుషోత్తముడు.

తెలుగులో ముద్రితమైన మొదటి అయిదు పుస్తకాలు క్రైస్తవ మతానికి సంబంధించినవే. రెవరెండ్ జెంజమిన్ షూల్జ్‌చే విరచితమైన ఈ పుస్తకాలు 1746-47లో ముద్రించారు. ఈ పుస్తకాలలో మతైక విషయాలకే ప్రాధాన్యత యివ్వడం వలన సాహితీ శ్రేణిలో పరిగణనలోకి రాలేదు.

1750లో ముద్రితమైన పింగళి ఎల్లనాచార్యుని "తోభ్యచరిత్ర" క్రైస్తవ సాహిత్యానికి శ్రీకారం చుట్టిందని చెప్పవచ్చు. ఆ తరువాత మంగళగిరి ఆనందకవి 1760లో "వేదాంతరసాయనము" అనే కావ్యాన్ని, మల్లెల తిమ్మరాజు 1770లో "జ్ఞానచింతామణి" అనే గ్రంథాన్ని రచించారు. తదాదిగా అడపాతడపా కొన్ని పాటలు, పద్యాలు, వ్యాసాలు, ప్రసంగ పుస్తకాలు వెలుగుచూసి ఉండవచ్చు. కాని అలాంటి వాటి ప్రస్తావన యెక్కడా లేని కారణంగా వాటిని ఉదహరించలేము.

ఎన్నెన్నో ఆవిష్కారాలతో, మతైక, సామాజిక, సాంస్కృతిక జీవన ప్రవంతిలో మంచీ చెడులను యెంచి విశ్లేషనాత్మక దృష్టితో బేరీజులు వేసి నూతన ఆధ్యాత్మిక వాతావరణాన్ని, పారమార్థిక చింతనను కలిగించి శ్రేయోమార్గాలను చూపించిన మహనీయుడు పురుషోత్తము చౌధరి గారు. వీరిని గురించి ప్రస్తావించాలన్నా, మాట్లాడాలన్నా, అది హస్తిమశక న్యాయమే అవుతుంది. ఆ మహాకవి జీవిత మధురిమలను, భావోన్నతిని, అమూల్యభరణాలనదగిన పాటల ప్రశస్తిని, యేసునాథ కథాసుధా రసాన్ని ఈ నవతరానికి సంక్షిప్తంగా పరిచయం చేయలన్నదే ఈ ప్రయత్నం.

ఈ సందర్భంలోనే మరో విషయాన్ని కూడా ప్రస్తావించాలి. పురుషోత్తమ కవి సనాతన బ్రాహ్మనుడు. హిందూ మతావలంబి, మతాచార కర్మకాండలలో మునిగి తేలినవాడు. భగవద్గీతా ప్రబోధానుసారంగా భక్తి మార్గం, జ్ఞానమార్గం, కర్మ మార్గాలను కఠోర దీక్షతో అవలంభించినవాడు. ఆ దశలో ఉన్నపుడు – విష్ణు స్తోత్రము, శివస్తోత్రము, గురుస్తోత్రము, నీలాచల విలాసము, కృష్ణలీల, దశరథరామ శతకము – ఇత్యాది హైందవ భక్తి సాహిత్యాన్ని సృజించాడు. వాటి నేపథ్యం, కవితా పటిమ, లక్షణాలు, ఆవిర్భావ వికాసాలను పరిశీలించడానికి ఆ పుస్తకాలు నాకు లభ్యం కాలేదు. కాని కావ్య రచనా విధానంలో వీరు కనపరిచిన ప్రజ్ఞ, ప్రత్యేక వైశిష్ట్యం, పాటించిన కవితా ధర్మాలను పరిశీలించినవారు వెలుబుచ్చిన అభిప్రాయాలు. కవికి కల్పించిన ఉన్నత స్థానాన్ని పురస్కరించుకొని, వీరు హైందవ సాహిత్యంలో కూడా అత్యంత ప్రతిభాశాలి అయిన పండితోత్తముడు అని ఢంకా

కొట్టి చెప్పవచ్చు. తెలుగు సంకీర్తనా వాఙ్మయాన్ని పరిశీలించిన తరువాత లాక్షిణికులు క్రైస్తవ భక్తిసాహిత్యానికి పెద్ద పీట వేశారు. లోకోత్తర విశిష్టత కలిగిన సంకీర్తనా వాఙ్మయాన్ని నాలుగు ఘట్టాలుగా విభజించారు.

ప్రథమ ఘట్టం: వైష్ణవ భక్తి – శ్రీ వెంకటేశ్వరుడు: అన్నమాచార్యులు (1408–1503)

ద్వితీయ ఘట్టం: మువ్వగోపాల భక్తి (మధురభక్తి): క్షేత్రయ్య (1606–1750)

తృతీయఘట్టం: శ్రీరామ భక్తి: త్యాగయ్య (1767–1847)

చతుర్థఘట్టం: క్రైస్తవ భక్తి – యేసుక్రీస్తు: పురుషోత్తము చౌధరి (ముఖ్యుడు 1844 నుండి)

భక్తి సంకీర్తనా వాఙ్మయాన్ని ఉన్నత శిఖరాలపై అధిష్టింపచేసి, అపారమైన కీర్తి ప్రతిష్టలను సముపార్జించి – అన్నమాచార్యులు, క్షేత్రయ్య, త్యాగయ్యల వంటి భక్తాగ్రేసరుల వరుసలో చేరిన పురుషోత్తము కవి సంపూజితుడు. ఇంచుమించు అదే కాలంలో ఆణిముత్యాలాంటి కీర్తనలను రచించి భక్తి తత్పరతను పెంపొందింపజేసినవారిలో పులిపాక జగన్నాథముగారు ఒకరు, అలాంటి కవులను సంస్మరించడం కూడా ఉచితం.

సంప్రదాయ కవిత్వానికి కొన్ని లక్షణాలు, ధర్మాలు ఉన్నాయి. గుర్తింపు పొందిన ప్రతి కవులు ఈ ధర్మాలను విధిగా పాటించారు. పురుషోత్తము కవి కూడా వీటిని తూ.చ. తప్పకుండా పాటించాడు. సూచన ప్రాయంగానైనా ఆ కవితా ధర్మాలను పేర్కొనడం ధర్మం. వాణీశాసనుడైన నన్నయ్య ఆది కవి. తెలుగులో అనువాదితమైన "భారతము" ఆది కావ్యం. ఆ కావ్యంలో పాటించిన కవితా ధర్మాలను ఆదర్శంగా కవులు స్వీకరించారు. వారు కావ్యాన్ని దేవతా స్తుతితో మొదలు పెట్టేవారు. లఘుకావ్యంలో కూడా ఆద్యము దేవతా స్తుతి. తమ ఇష్ట దైవాన్ని సంభోదిస్తూ స్తుతించడం ఆనవాయితి. అది సర్వసాధారణంగా "శ్రీ" తో ప్రారంభమౌతుంది. 'శ్రీ' – అనే అక్షరానికి నానార్థాలున్నాయి. లక్ష్మి, విష్ణువు – దైవనామాలు; సంపద, శోభ, ఖ్యాతి – మానవులు ఆశించేవి. అంత భావగర్భితాన్ని సంతరించుకొన్న "శ్రీ"తో కావ్యాన్ని ప్రారంభించడం అన్ని విధాల శ్రేయస్కరం, శుభదాయకం. అందుకే – కావ్యాన్ని ప్రారంభించాడు అని చెప్పడానికి బదులు "శ్రీకారము" చుట్టాడు అని చెబుతారు. ఈ కవితా ధర్మాన్ని పురుషోత్తముడు విస్మరించలేదు. క్రైస్తవ కవిత్వాన్ని ప్రారంభించినా ఈ సంప్రదాయాన్ని విడిచిపెట్టలేదు.

యేసునాయక శతకము, యేసుక్రీస్తు ప్రభు శతకము – ఈ రెండు శతకాలు 1845లో మొదట వ్రాసిన శతకాలు. ఇందులో మొదటి పద్యాలను గమనించాలి.

"శ్రీరాజిల్లు భవత్పదాబ్జములు నాచిత్తంబులో నిల్పి నీ, కారుణ్యామృత బిందు బృందములు వేడ్కల్ మీరగ జిల్కి, దుర్వార స్వాం దురంత తాపమును దీరన్ శాంతి బొందించి యీ, వే రక్షణ్యము నీ నుతుల్ వినగరావే యేసుక్రీస్తూ ప్రభో" యేసుక్రీస్తు ప్రభు శతకము, (సెప్టెంబర్ 1945–శార్దూల పద్యము).

అట్లాగే "శ్రీకరమై సుధీజన వశీకరమై నిజభక్త నిత్య సౌఖ్యాకరమై సమస్త జగదావన పావన రక్తసిక్త శోభాకరమై వెలంగెడు భవత్పద పద్మము లాశ్రయించి నే ప్రాకట భక్తితో గొలుతు బాయక యెప్పుడు యేసునాయకా. (యేసు నాయక శతకము జూలై 1845).

పురుషోత్తముకవి కొన్ని దండకాలను కూడా వ్రాసారు. ఆ ప్రక్రియలోనూ ఈ సంప్రదాయాన్ని పాటించడం గమనార్హం. ఒక దండకము ఎత్తుగడను ప్రస్తావిస్తాను.

"శ్రీ నిత్యమై సత్యమై సాధు సంతృత్యమై సంతతౌన్నత్యమై సర్వలోక ప్రశస్త ప్రభానిస్తులంబైన క్రీస్తు ప్రభోధా సుధా మాధురీ భాషితంబుల్ ప్రధానంబుగ సత్యవేదంబులో నున్నరీతిన్ గడుం బ్రీతితో కొన్ని నేనెంచి విన్పించెదన్ మర్త్యులారా ముదంబార మీరాలకించగన్ గోరికన్ సారెకున్ వేడెదన్ చిత్తగించండి." అని ప్రారంభించి –

".... నీ భక్తిలో నిల్చి నీ వాక్యముల్ దాల్చి విశ్వాసినై మానసోల్లాసినై యింక నీ దాసదాసానుదాసుండనై యుండగా గోరితిన్ జేరితిన్ నన్ను రక్షించుమో క్రీస్తునాథా సదా సర్వలోకైక నాథా మహాఘోర పాపౌఘ భేదా శ్రితా మోదపాదా నమస్తే నమస్తే నమ:" అని ముగిస్తారు.

సంఘాలలో కవిగారి కీర్తనలకున్న ప్రచారస్థాయి, ప్రాచుర్యం వీరి శతకాలకు, కావ్యాలకు తదితర సాహిత్య ప్రక్రియలకు లేకపోవడం ఒకింత బాధాకరమైన విషయం.

కవితా ధర్మాలను పాటించిన పురుషోత్తముడు తాను రచించిన కీర్తనలలో కూడా వాటిని వ్యక్తం చేశారు. మగణం మంగళ ప్రథమవడం వల్ల కావ్యారంభ పద్యం మగణంతో మొదలుపెట్టడం పరిపాటి. ఇష్టదేవతా స్తుతిని కీర్తన ద్వారా చేయాలని సంకల్పించినప్పుడు తొమ్మిది చరణాలున్న కీర్తన వ్రాయడం కవితా ధర్మం. సంఘాలలో – ముఖ్యంగా వివాహ సమయాలలో విధిగా పాడే కీర్తన "మంగళమే యేసునకు..." వాస్తవానికిది స్తుతి కీర్తన. అందుకే దీన్ని "యేసుక్రీస్తు స్తుతి" అనే శీర్షికన చేర్చారు. "క్రీస్తునకు స్తోత్రము" అని ఈ కీర్తనకు పేరు పెట్టారు. ఇంచుమించు ఇలాంటి కీర్తన – వందనమే యేసునకు – ఈ

కీర్తనకు "క్రీస్తునకు మంగళార్చన " అని పేరుపెట్టారు. కవి పాటించిన కవితా ధర్మాన్ని గౌరవించి యధాతథంగా ఆ కీర్తనలను ముద్రించినవారు రెవరెండ్ డాసన్ దొరగారు. శ్వేత జాతీయుడే అయినా, మాతృక ఆంగ్లేయ భాషే అయినా, తెలుగులో ఉద్దండ పండితుడు: గొప్పకవి: సంకీర్తనాకారుడు: ప్రథమ శ్వేతజాతీయుడైన తెలుగు వాగ్గేయకారుడు. వీరు 1846లో ప్రప్రథమంగా ఆంధ్ర క్రైస్తవ కీర్తనల పుస్తకాన్ని వెలువరించారు. ఆ పుస్తకంలో పురుషోత్తము చౌధరి గారి కీర్తనలు, డాసన్ గారి కీర్తనలు, పులిపాక జగన్నాథం గారి కీర్తనలే ఉన్నాయి. మంగళమే యేసునకు.... అనే స్తుతి గీతం అక్కడ ఆ పుస్తకంలో కవితా ధర్మాన్ని పాటించి వ్రాసిన తొమ్మిది చరణాలున్నాయి. ఇప్పుడు సంఘాలు పాడుకొనే ఆంధ్ర క్రైస్తవ కీర్తనల పుస్తకంలో ఆరే చరణాలున్నాయి. ఇరవై సంవత్సరాల క్రితమే ఈ విషయాన్ని ప్రకాశకుల దృష్టికి తీసుకొచ్చాను. లోపించిన ఆ చరణలను జతపరచమని అర్థించాను కాని ప్రయోజనం లేకపోయింది. మిగతా మూడు చరణాలు ఇవి:-

1. ఘనుడైన యెహోవా -యను పేరిటి దేవునికి = తనయుండై బరగు-సజ్జన పూజ్యున కెపుడు .. మంగళమే

2. దుర్మరణ శ్రమలకు -పేర్మితోనోర్చుచు = ధర్మజ్ఞానము దెల్ప- దైవవాక్యమునకు.. మంగళమే

3. పరమార్థము జూపుటకు - భావంబులు మార్చుటకు = పరిశుద్ధాత్ముని కొరకు - ప్రార్థింతుము నీకు .. మంగళమే

వీరు హైందవునిగా ఉన్నప్పుడు రచించిన కావ్యాలు, కీర్తనలు లభ్యం కాలేదు అని చెప్పుకొన్నాం. కాని కవి జీవిత చరిత్ర రచించిన బాబు జాన్ చౌధరిగారు ఒక కీర్తన ఉదహరించారు. పొరపాటున దాన్ని క్రైస్తవ కీర్తనలతో జతపరచి ముందుగా ముద్రితమైన పుస్తకంలో అచ్చు వేశారు. అది కూడా అసంపూర్తిగానే మిగిలిపోయింది. కవితా ధర్మాన్ని పాటించి లిఖితమైన కీర్తన. ఆ కీర్తనను పేర్కొనటం అసందర్భం కాకపోవచ్చు.

"కన్న తండ్రి వనుకొంటి - గతి నీవె రామ - యెన్నో వ్రతములు చేసి యీ మనుజ జననంబు - నెత్తినందుకు మేలు - దెందుగనబడదు.. కన్న తండ్రి..."

ఇలా సాగిన కీర్తన నాలుగో చరణంలో రామున్ని కొనియాడుతూ కవి ఆనాటి తన ఇష్టదేవతా స్తుతి చేసినట్టు గమనించగలం! దరిమిలా ఈ కీర్తన్ని పుస్తకం నుంచి తొలగించాం.

పుస్తకరూపం చెడుతుందని, సంఖ్యల పొందిక, పుటమీద క్రమంగా కనపించవు అని, భాషమీద, కవితా ధర్మాలమీద సరైన అవగాహన లేని వాళ్ళు సంపాదకులుగా

వ్యవహరించి నా అభ్యర్ధనను త్రోసి పుచ్చారు. ఇలాటి లోపాలు చాలా ఉన్నాయి.

ఆలాగే మరో కీర్తనకు మరో రకంగా అపచారం జరిగింది

"యెహోవా నా మొఱలాలించెను- తన - మహాదయను నను - గణించెను:

అహర్నిశల దీనహీనుడగు నాదు - హాయనెడు ధ్వని - గ్రహించి మనిపెను"

(ఆంధ్ర క్రైస్తవ కీర్తనల పుస్తకము - 16 కీర్తన). ఈ పల్లవిలో "దీన హీనుడగు" అనే మాటలు కవి గారు వ్రాసినవి కావు. "ధైర్యహీనుడగు" అని వారు వ్రాసారు. ఇందుకు కారణం లేకపోలేదు. ఈ పాటను శ్రద్ధగా పరిశీలిస్తే "గజేంద్రమోక్షము" సాదృశ్యంగా గోచరిస్తుంది. ఒక నాటి విష్ణు భక్తుడైన పురుషోత్తముడు అందులోని ఉత్కంఠ భరితమైన ఘట్టాన్ని పాపపు ఊబిలో కూరుకుపోయిన తనకు 'యెహోవా దేవుడు యెలా విముక్తిని ప్రసాదించాడో ఆ విషయాన్ని సమన్వయించుకున్నాడు. నీటిలో కాలిడిన ఏనుగు కాలును మొసలి తన నోట కరుచుకొని మరింత లోతులోకి లాగే సమయంలో గజరాజు తన శక్తినంతా ధారపోసినా ప్రయోజనము లేకపోయేసరికి :

"లావొక్కింతయులేదు ఠావుల్ తప్పెన్ ధైర్యము విలోలంబయ్యె" అని వాపోతాడు.

ఇది తెలియని కారణాన "ధైర్యహీనుడగు" అనే మాటలకు బదులు "దీనహీనుడను' అనే పదాలను ఉటంకించారు.

పేరెన్నికగన్న మరో కవి రాసిన మరొక కీర్తనను కుదించడంవల్ల పెద్ద పొరపాటు జరిగిపోయింది.

ఆ కీర్తన - "దేవాదీవించుమిప్పుడు - దీన జనాలిన్ - గావ రార మ్మెల్లప్పుడు" (ఆ.క్రై.కీ279) ఈ పాటను శ్రద్ధగా పరిశీలిస్తే దీనికున్న అయిదు చరణాలలో ఒక ప్రత్యేకత కన్పిస్తుంది. ప్రతీ చరణం మొదటి మాట రెండో అక్షరాన్ని గమనిస్తే "మురారి దావీ-" అనే అక్షరాలు కన్పిస్తాయి. కవి పేరు మురారి దావీదు. అయిదు చరణాలనే ముద్రించడం వల్ల ఆరో చరణంలో ఉన్న "దు" అక్షరం లోపించింది. ఆనాటి సంపాదకులు దీన్ని గ్రహించకుండా పుటలరూపం పొందికగా ఉండదని భావించి ఆరో చరణాన్ని తీసి వేయడం ద్వారా కవిగారి ప్రతిభను గుర్తించకుండా పోయింది. పురుషోత్తము చౌధరీ గారి కీర్తనలను సవరించడం అర్ధజరతీయ న్యాయంగా ఉదహరించవచ్చు. అంటే - కవితా ధర్మాలు తెలియకుండా అవి శాస్త్రీయమో, అశాస్త్రీయమో నిర్ణయించడం, సంస్కృతీ పరమైన పూర్వాపరాలను తెలుసుకోకుండా కవి వాడిన పదాలను సవరించడం సబబుకాదని అర్థం.

మానవ భావావేశాన్ని పురుషోత్తము కవి వ్యక్తీకరించినంత మృధువుగా, గాఢంగా వ్యక్తీకరించిన కవులు తక్కువ. వీరి కీర్తనలు ఆర్ద్రంగా, ఆత్మీయంగా, హృదయాలలో చొచ్చుకుపోతాయి. అతని వేదన అంతిమంగా మన వేదనగా పరవశిస్తుంది. పురుషోత్తముని పాండిత్య గరిమకు అద్దం పట్టే కొన్ని కీర్తనలను శత పత్ర శాసన న్యాయంగా ప్రస్తావించాలని అభిలషించాను. నేను యెంచుకొన్న కీర్తనలన్నింటిలోను అంతర్వాహిని భక్తి తత్వమే. వీరు వ్రాసిన తొలి కీర్తన "మా యేసు క్రీస్తుని - మఱుగు గల్గెనురా - నా యాత్మ ఘన రక్షా నగము నెక్కెను రా' (ఆం.క్రై.కీ.490). 1833 అక్టోబర్ 6వ తేదీన కటక్‌లోని గంగామందిరము అనే కోనేటిలో జ్ఞాన స్నానం (బాప్తిస్మం) పుచ్చుకొని క్రైస్తవ మతాన్ని స్వీకరించినప్పుడు వ్రాసి తానే స్వయంగా గానం చేసిన కీర్తన. బహుశా తెలుగులో క్రైస్తవ భక్తి సాహిత్యానికి కూడ ఇదే తొలి కీర్తన కావొచ్చు. పాపభూయిష్టమై అస్తవ్యస్తంగా మారిన తన గత జీవితాన్ని గుర్తుచేసుకుంటూ, తనకు సంప్రాప్తమైన "చిరసౌఖ్యోన్నతి"కి కారణం "యేసుక్రీస్తుని మఱుగుగల్గెనురా" (అంటే యేసుక్రీస్తు శరణము లభించిందని) తద్వారా" నా యాత్మ ఘనరక్ష నగము నెక్కనురా' (అంటే తన ఆత్మ రక్షణ అనే ఉన్నత శిఖరాన్ని అధిష్టించిందని అర్థం). నేను యెక్కలేనంత ఎత్తైన కొండపైకి నన్ను ఎక్కించుము - అని అలనాడు దావీదు సంకీర్తనాకారుడు రచించిన కీర్తన జ్ఞాపకమొస్తుంది. అంత ఎత్తైన కొండను యెవరూ ఎక్కలేదు, అది ఒక్క యేసుక్రీస్తుకు మాత్రమే సాధ్యమైంది ఆ కొండ కలవరి కొండ - అదే రక్షణ కొండ! "హితముగా తన జీవ-మిచ్చే క్రీస్తుడురా - మృతిచేత మన పాప వితతి గొట్టెనురా.." తత్ఫలితంగా వారి ఆత్మకూడా ఘనమైన కొండ ఎక్కిందని తన మనోగతాన్ని ఎరుకపర్చాడు.

ఆంధ్ర క్రైస్తవ కీర్తనల పుస్తకంలో పల్లవి, ఆరు చరణాలు మాత్రమే ఉన్నాయి. మొదటి సంపుటిలో "కులాచార పరీక్ష' అనే పుస్తకంలో ఏడవ చరణాన్ని పొందు పరిచారు.

"రాగద్వేషముల సంభ్రమెల్ల జెడెరా - మూగబొమ్మ పాదముల ద్రొక్కబడెరా - యోగమార్గములన్ని యోటి కుండలురా - సాగుపాపపు బుద్ధి చతికిళ్ళబడెరా"

పురుషోత్తము కవి కీర్తనలను తన అనుభూతులకు వాహికగా ఎంచుకొన్నాడు. వస్తువులోను, అభివ్యక్తి లోను ప్రకృష్టమైన బంధాన్ని యేర్పర్చి తన కీర్తనలను ప్రబంధాలుగా తీర్చిదిద్దాడు. హైందవ జీవితం పూర్వ స్థితి కాగా క్రైస్తవ జీవితం తదుపరి స్థితి - ఈ రెండు జీవితాలకు ఉన్న తారతమ్యాన్ని, తన అనుభవాన్ని పురస్కరించుకొని వర్ణన సామర్థ్యంలోనూ వైవిధ్యంలోను వ్రాసిన కావ్యాలు, కీర్తనలు పదుగురికి ఆదర్శప్రాయాలు.

అటువంటి పుస్తకాలలో **"కులాచార పరీక్ష' ప్రధానమైంది.** అది 1833లో ప్రప్రథమంగా లిఖితమైన పుస్తకం.

కులాచారాన్ని వ్యతిరేకిస్తూ వారు పలికిన మాటలు, **"బ్రహ్మ తన ముఖము వల్ల బ్రాహ్మణులను, భుజము వల్ల క్షత్రియులను, తొడలవల్ల వైశ్యులను, పాదములవల్ల శూద్రులను సృష్టించెనని"** భాగవతము మొదలగు పురాణములందు వ్రాయబడి ఉన్నదనిచెప్పుతున్నారు. అట్లయిన మొదటి ఈ నాలుగు కులములను కలుగజేసిన బ్రహ్మయేమి కులము వాడు? ***బ్రహ్మ ఒక్క కులము కలవాడైతే తనకు పుట్టిన నలుగురు కొడుకులు నాలుగు కులములు యేలాగు అవుతారు?*** - అని కుల వ్యవస్థను ఎండగడతాడు. పరిష్కారమార్గంగా ; **"మనుష్యులలో రెండు జాతులు మాత్రమే గలవు. అవి యేమంటే దేవుని మాట నమ్మి క్రీస్తు నందు విశ్వసించిన వారందరూ మోక్షమునకు వెళ్ళుదురు. అది దైవజాతి అనబడును. రెండవది - కులాభిమానమును, పాపమును విడువని వారందరూ నరకాగ్నిలో త్రోయబడుదురు. అది సాతాను కులమనబడును. ఇంతేగాని మరేజాతి బేధములు మనుష్యులలో లేవు".**

వర్ణవ్యవస్థ వలన అవర్ణమైన మానవ జీవితం సమాజ గత పరిణామ ప్రవర్ధకమై పొందే పరివర్తనాన్ని వెంబడించి తను నమ్మిన సత్యాన్ని బాహటంగా వెల్లడించడానికి వెరవని కవి పురుషోత్తముడు. మతమౌఢ్యాన్ని జంకూ గొంకూ లేకుండా సాహిత్యం ద్వారా సామాజిక సంస్కరణాన్ని, సంకీర్తనలద్వారా భక్తి తత్పరతను ఉద్దీపనం చేసిన ఘనత వారికే దక్కుతుంది.

ఆనాటి సామాజిక దుర్వ్యవస్థ నేపథ్యం కాగా - అలజడి జీవితాలకు, ఆందోళిత ఊపిర్లకు ఊరట కలిగించే ఆదరణభరిత కీర్తనలని రచించాడు. "డెందమానందంబు నిండు ఉండదీ జగమందురా - యందముగను క్రీస్తుపాదమందు భక్తి నిల్పరా - మాయలోని మాయసర్వము మాయలోకమాయెరా - కాయము సౌపాయము - నాదాయమెల్ల మాయరా....

**మరోకీర్తన :** "పరమదయానిధి క్రీస్తుని బలమున - బాప భరంబులు విడు నన్న - శుద్ధాత్ముని బంధుత్వంబున అరమర చీకటు - లన్నియు దొలగును...

"మనసానందము బొందుటకన్నను మరియే భాగ్యము గలదన్న" (ఆం.క్రై.కీ.489)

అముద్రిత కీర్తనలు వందకు పైగా ఉన్నాయి. అవి ఇక లభ్యం కావు అనుకొనే తరుణంలో రెవ.బి.డి.పి.రావు. (రాజమహేంద్రం) గారు వాటిని సేకరించి మహోపకారం చేశారు. వారి కృషి అభినందనీయం.

బళ్ళారి మిషను వారు ప్రచురించిన కరపత్రాలను రెండింటిని నాకు అందజేసి అవి పురుషోత్తము చౌధరి గారి రచనలో కావో నిర్ధారించమని జె.జె. చౌధరిగారు కోరారు. అవి.

1. **అంత్య న్యాయతీర్పు,**
2. **మోక్ష మార్గము.**

ముందుగా ఒక విషయాన్ని స్పష్టపరచాలి. ఆ రోజుల్లో బళ్ళారి మిషనరీలు తెలుగులో పుస్తకాలను, కరపత్రాలను ముద్రిస్తూ ఉండేవారు. తెలుగులో ప్రప్రథమంగా ప్రచురితమైన పత్రిక (మ్యాగజైన్) - **"సత్యదూత".** 1835లోనే ఈ పత్రికను బళ్ళారి మిషనరీలు అచ్చువేశారు. ఆ తరువాత ఎస్.పి.సి.కె. ప్రకాశకులు మదరాసు నుండి ప్రచురించడం ప్రారంభించారు. అది 1886 నుండి మొదలయింది. ఆ రోజుల్లో మదరాసులో తెలుగు వాళ్ళు ఎక్కువ మంది ఉండేవారు. ముఖ్యంగా అడయార్ (పేట)లో అధిక భాగంలో తెలుగువారే ఉండేవారు. వారు సేకరించిన తెలుగు పత్రిక సత్యదూత అవడం వల్ల దాన్ని 1886 అచ్చయిన తెలుగు తొలి పత్రిక అని నిర్ధారించారు. వాస్తవానికి యీ పత్రిక 1835 లోనే బళ్ళారి నుండి వెలువడింది.

పురుషోత్తము చౌధరి గారు మిషనరీలను కలుసుకోవడానికి బళ్ళారి వెళ్ళారు. అది- మదరాసు నుండి నాలుగు వందల మైళ్ళు కాలి నడకన వెళ్ళారని అలా వెళ్ళేటప్పుడు "వినరే యో నరులారా వీనులకింపు మీరా.." అనే క్రిస్మస్ కీర్తనను వ్రాసి పాడుకుంటూ బళ్ళారి వెళ్ళారని చెబుతారు. నిజానికి ఆ కీర్తన కేవలం క్రీస్తు జననానికే పరిమితం కాలేదు! అందులో ఆయన జననం, మరణం, పునరుత్థానం - ఒక్క మాటలో చెప్పాలంటే, ఆయన నరావతారంలోని పరమార్థాన్ని వివరించే కీర్తన అది.

పురుషోత్తము చౌధరి గారు 1835లో బళ్ళారిలో ఉన్నపుడు కొన్ని ప్రసంగాలు చేశారు. అట్లాగే కొన్ని కరపత్రాలు వ్రాసారు. కొన్నింటిని అనువదించారు. రెవరెండ్ రీడ్ గారు వీటిని సంక్షిప్తం చేసి కరపత్రాలుగా ముద్రించారని, అందుకు సహాయపడిన మరో మిషనరి రెవ. పెయ్స్‌గారని, ఇందుకు సంబంధించిన చరిత్రాధారాలున్నాయి. బళ్లారిలో ఉన్న తెలుగువారి మీద కన్నడ భాష ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అక్కడున్న ప్రజలకు వివరించే పద్ధతులు, పదప్రయోగాలు, చెప్పేతీరు, లిపిలో కొంత తేడాలు విధిగ ఉంటాయి. కాబట్టి ఎవరేం చేశారో చెప్పడం కష్టమే అవుతుంది.

**మోక్షమార్గము, అంత్య న్యాయతీర్పు** ఈ రెండు కరపత్రాలను పురుషోత్తము చౌధరి గారే వ్రాసారని నిర్ధారించవచ్చు. ఈ రెండు అంశాలు వారికి ఇష్టమైన అంశాలు. పది

రకాలుగా ప్రసంగాల ద్వారా, కీర్తనల ద్వారా వీటిని వివరించారు " ఓ జనులారా", అనే సంభోధనాత్మక పదం ఈ రెండు వ్యాసాల్లోనూ కన్పిస్తుంది. **"ఓ జనులారా యీ లోకమందు మన పూర్వీకులు పుట్టి చనిపోయినారు..."** (అంత్య న్యాయతీర్పు)

**"ఓ జనులారా దేవుడు నీకు మోక్షము నివ్వవలెనని మీరు కోరుచున్నారు కదా"** (మోక్షమార్గము).

ఆంధ్ర క్రైస్తవ కీర్తనల పుస్తకములో ఈ సంబోధానాత్మక పదాలలో కవిగారు వ్రాసిన కీర్తనలు ఉన్నాయి. "రారో జనులారా – వేగము గూడి– రారో ప్రియులారా – శాశ్వతమైన – ఘన రక్షణ జేర – సారాసారముల్ – సమ్మతిగా జూచి ధీరత్వమున క్రీస్తు– జేరు దారి గోరి..." (ఆం.క్రై.కీ.301)

మరోకీర్తన –

"వినరే యో నరులారా ("జనులారా" అని పాడిన గణ విభజన చెడిపోదు) –

వీనుల కింపు మీర – మనల రక్షింప క్రీస్తు –మనుజావతారుడయ్యె వినరే..."

నాలుగవ చరణము "ఇల మాయావాదుల మాని – యితడే సద్గురు డని – తలపోసి చూచి మతి ని –శ్చల భక్తిని గొలిచిన వారికి – నిల జనులకు గలు – ములనలరెడు ధని – కుల కందని సుఖ – ములు మరియొసగును.. (ఆం.క్రై.కీ. 104)

ఈ కీర్తనల సారాంశం పైన పేర్కొన్న కరపత్రాలలో విశద పర్చడం ఒక కారణం. **"కులాచార పరీక్ష"** 1833లో లిఖితమైంది ఆ వ్యాసం ఇలా మొదలైతుంది; "ఓ జనులారా!" ఈ సంబోధనా పదం వ్యాసంలో పది సార్లు కన్పిస్తుంది.

భాషాశైలి కూడా పురుషోత్తమునిదే. పోతే అక్కడున్న ప్రజలకు అర్ధమయ్యే రీతిలో కొన్ని మార్పులు చేయడం జరిగింది. అది తప్పనిసరి. ప్రాంతీయ పద పొందిక లేకపోతే విషయ బోధన స్పష్టంకాదు. కోస్తా ఆంధ్ర ప్రాంతంలో పరిశుద్ధుడైన యోహాను, పరిశు ద్ధుడైన పేతురు, పరిశుద్ధుడైన పౌలు లేదా అపోస్తలుడైన పౌలు అని పేర్కొంటారు. ఆనాటి మిషనరీలు బళ్ళారి ప్రాంతములో వాడిన మాటలు ప్రేషితుడైన యోహాను, ప్రేషితుడైన పెత్ర (ఇది పేతురుకు గ్రీకు పదము), ప్రేషితుడైన పౌలు. మిషనెరీ సేవను ప్రేషితోద్యమం అని ఉదహరించారు. ఆ పదాన్ని వాడడం సబబే.

**"మోక్షమార్గము"** అనే కరపత్రానికి మూలం **"ముక్తిమార్గ ప్రదర్శనము"**. దీన్ని కుదించి ఆ కరపత్రాన్ని అచ్చు వేశారు అనే వాదన కూడా దీన్ని పరిశీలించడానికై – ముక్తి మార్గ ప్రదర్శనము – అనే పుస్తకం లభించలేదు. ఎవరైనా డాక్టరల్ డిగ్రీకి వ్రాసే పుస్తకంలో

భగీరథ ప్రయత్నం చేస్తేనే గాని లేకపోతే చౌధరీ గారి ప్రతిభకు న్యాయం చేకూర్చలేం. ఇప్పటికే బాబు జాన్ చౌధరీ గారు, రెవరెండ్ ఆర్.ఆర్. సుందర్ రావుగారు, డాక్టర్ గుజ్జర్లమూడి కృపాచారిగారు, డాక్టర్ సుధారత్నాంజలీ సామ్యూల్ గారు ప్రభృతులు కృషిచేసారు ఇంకా చేయవలసింది చాలా ఉందని నా అభిప్రాయం.

విశ్వమానవ సౌభ్రాతృత్వానికి నిబద్ధుడై, క్రైస్తవ భక్తి కేతనాన్ని ఎగురవేసి, అమృతతుల్యమైన కవితా ఝరిని గుండెల్లో ప్రవహింప జేసిన కవితా తపస్వి, యేసుక్రీస్తు భక్తుడు పురుషోత్తము చౌధరి. రసార్ద్రభావనోదీప్తి కలిగించే సుందర సుమధుర రస గులికల్లాంటి కీర్తనలతో ఈ నాటికీ సంఘాలను అలరింపచేస్తున్న అమరుడు పురుషోత్తముడు.

**లభించిన అలభ్యాలు - చారిత్రక భూమిక**

మొన్న మొన్నటి వరకు అలభ్యాలు అని వ్యాఖ్యానకర్తలు, పరిశోధనా వ్యాసకర్తలు పేర్కొన్న పురుషోత్తము చౌధరీ రచనలు **విగ్రహ నిర్మాణము; మనసే మూలము, దేవుని విరుద్రూప వర్ణనము; ముక్తి మార్గ ప్రదర్శనము; జన్నాథ పరీక్ష; బ్రహ్మజ్ఞానము; మాశూచి విశూచి సంకట భ్రాంతి నివృత్తి; బైబిలు కన్‌కార్డెన్స్; దైవిక శాంతి మార్గము; ఆంధ్ర ప్రసంగములు; ఒరియా ప్రసంగమాలిక** ఇందు రెండో మూడో మినహా మిగతావన్నీ ఇటీవల లభించాయి. అవి లభించాయి అని చెప్పడం కన్నా శ్రీ జేమ్స్ జయశీల్ చౌధరీ గారు సంపాదించారు అని చెప్పడం భావ్యం. ప్రయాణం చేయుటం; స్వయంకృషి - ఇవి అష్టకష్టాలలో ఇమిడిన కష్టాలు! జె.జె.గారు పట్టువిడవని అభినవ విక్రమార్కునిలా అనుమానమొచ్చిన ప్రతి గ్రామానికి ప్రయాణం కట్టారు - పుస్తకం గానీ, అందుకు సంబంధించిన సమాచారం గానీ ఏదైన దొరుకుతుందేమో నన్న ఆశతో. ఇప్పటివరకు అలభ్యాలనుకొన్న వాటిని ఎలాగైనా సంపాదించాలని వీరు సల్పిన స్వయం కృషికి ఆకాశమే హద్దు! అప్పుడు నేను ఇంగ్లాండ్‌లో ఉన్నాను. లండన్‌లో ఉన్న బ్రిటిష్ లైబ్రరీ వారితో సంప్రదించి, పురాతన గ్రంథ సముదాయం నుంచి వెలికి తీయించి, దుమ్ము దులిపించి, వారికి విషయం చెప్పాను. వ్యయప్రయాసల కోర్చి ఆ ప్రతుల్ని తెప్పించారంటే అది గగన కుసుమ న్యాయం లాంటిదని చెప్పొచ్చు. ఈ కృషి శ్లాఘనీయం. ఇంతగా జె.జె.గారి కృషిని మెచ్చుకొంటున్నానంటే వీరు సంపాదించిన ఈ 'అలభ్యపుస్తకాలను' క్షుణ్ణంగా పరిశీలిస్తే పురుషోత్తము చౌధరీ గారు మనకు మరో విధంగా సాక్షాత్కరిస్తారు. ఇంతవరకు మనం గుర్తించిన చౌధరీగారు మహాకవిగా, వాగ్గేయకారుడిగా, క్రైస్తవ భక్తి సంకీర్తనా సాహిత్యానికి ఆద్యుడుగా పరిగణనలోకి వస్తారు. వారు రచించిన కీర్తనలు సుమారు రెండు వంద

సంవత్సరాల నాటివే అయినా వీటిని నేటికీ అన్ని శాఖల వారు సంఘాలవారు పాడుతూ భక్తి పారవశ్యంలో తన్మయులవుతున్నారంటే వీరి కీర్తనల ప్రశస్తి, ప్రభావం ముఖ్యంగా కాల ప్రవాహంలో కొట్టుక పోకుండా నిలదొక్కుకొనే శక్తి, ప్రతిభ ఉన్నాయనటంలో సందేహం లేదు.

చౌధరీ గారి సంకీర్తనా సాహిత్యం ఒకెత్తు; సమాజాన్ని చైతన్య వంతం చెయ్యాలని సాహిత్యాన్ని ఒక సాధనంగా మలచుకోవడం మరోకెత్తు, మరింత స్పష్టంగా చెప్పాలంటే – సంఘ సంస్కరణకర్తగా తను చేసిన కొన్ని రచనలు ఇందుకు తార్కాణంగా ఉంటాయి. ఈ కోణంలో నుంచి వీరి రచనలను పరిశీలించి వెలువరించిన వ్యాసాలు పుస్తకాలు బహు తక్కువ, ఇంచుమించు లేవనే చెప్పాలి. పరిశోధన గ్రంథాలు వ్రాసేవారికి ఈ పుస్తకాలు లభించక పోవడం ప్రధాన కారణమని అర్థం చేసుకోవాలి.

చౌధరీగారు విశాఖపట్నం; మదరాసు; బళ్లారి ఇత్యాది ప్రాంతాలలో పర్యటించి ఆయా ప్రాంతాల పరిస్థితుల్ని, తాత్విక, మతైక, సిద్ధాంతిక భావజాలాన్ని ఆకళింపు చేసుకొన్నారు. అలాగే సామాజిక మార్పులను, అందుకు దోహదం చేస్తున్న సాహిత్య ధోరణలను పరిశీలించారు. ఇవి తన రచనల్లో ప్రతిబింబించాయి. స్వతహాగా తాను హైందవ మతావలంబి. ఉత్తర దేశంలో ప్రబలి ఉన్న వైష్ణవ మతాన్ని ముందుగా స్వీకరించి, ఆ తర్వాత దక్షిణ దేశంలో పాతుకపోయిన శైవ మతాన్ని స్వీకరించారు. అప్పటికీ వారు ఆశించిన మనశ్శాంతి లభించకపోయేసరికి యేసుక్రీస్తు ప్రబోధాలకు ముగ్ధుడై, క్రైస్తవుడై, శేష జీవితమంతా యేసు బోధామృతాన్ని లోకానికి చాటి చెప్పే రీతిలో కవిత్వాన్ని కొనసాగించారు. స్థూలంగా ఇది చౌధరీ గారి సాహిత్య విహారం. ఈ పరిణామానికి దారితీసిన ఆనాటి పరిస్థితులనూ, ధోరణిలూ విహంగ వీక్షణంగానైనా పరిశీలించడం అవసరం. సమకాలంలోని భక్తి ఉద్యమాల ప్రభావం ఎంతవరకు చౌధరీగారి మీద ప్రసరించింది, దీన్నెలా వారు ఉపయోగించుకొన్నారు అనేది పరిశీలనార్హం.

"భక్తి ద్రావిడ ఉపజీలీయే ఉత్తర్ రామానంద్
పర్గట్కియో కబీర్నే సప్తద్వీప్ నవఖండ్"

భక్తి దక్షిణ దేశంలో పుట్టింది. రామనంద్ దానిని ఉత్తర ప్రాంతానికి తీసుకొని వ్యాపింపజేశాడు. కబీర్ దాన్ని అన్ని ప్రాంతాలలో వ్యాపింపజేశాడు అని దీని భావం. దక్షిణ ప్రాంతంలో కొంత కాలం గడిపిన చౌధరీగారు అక్కడ భక్తి ధోరణిలను అధ్యయనం

చేశారు. బళ్లారిలోనే ఒక సంవత్సరంపాటు ఉన్నట్లు చరిత్ర ఆధారాలున్నాయి. అప్పుడది తెలుగు నగరంగా ఉండేది. క్రైస్తవ మిషనెరీలకది కేంద్రం. పైగా అక్కడ తెలుగు అచ్చుయంత్రం కూడా ఉండేది. మదరాసులో కూడా కొంతకాలాన్ని గడిపారు. అందువల్ల సాహిత్యంలో జరుగుతున్న వినూత్న ప్రయోగాలు, ముఖ్యంగా అన్నమయ్య పదకవితా విశిష్టత, మత మౌఢ్యాన్ని, కులాన్ని ఖండించే ప్రక్రియలు, ప్రజా జీవనంలో గణనీయంగా జరుగుతున్న మార్పులు, సామాజిక విశ్లేషణం, భూస్వామ్య వ్యవస్థలో చోటుచేసుకొనే మార్పులు - వీటన్నిటికీ అద్దం పట్టే భక్తి సాహిత్యం చౌధరీ గారి మీద ప్రభావాన్ని చూపెట్టింది. భావవాద తాత్త్విక దృక్పథాన్ని అంగీకరిస్తూనే భౌతిక జీవితాన్ని భక్తి, తత్వకవులు ఆశ్రయించారు. కర్మకాండలు, ఆడంబరాలు ఉన్నత వర్గానికి సంబంధించినవి కాబట్టి వీటిని ఖండిస్తూ, నిరసిస్తూ, భక్తిని అవలంబించారు. ఈ కోవకు చెందిన కవులను మూడు రకాలుగా విభజింపవచ్చు 1) స్వీయ భక్తి మార్గంలో దేవుని ఐక్యతను సాధించగోరిన కవులు; 2) దైవభక్తి కేంద్రంగా సమకాలిన సామాజిక వ్యవస్థను వ్యతిరేకించి సంస్కరణ భావాలను ప్రవేశపెట్టిన వారు; 3) యోగానికి, తంత్రానికి ప్రాధాన్యత నిచ్చినవారు. మొదటి రెండు వర్గాల కవితా ధోరణులు చౌధరీ గారు కవిత్వంలో కనిపిస్తాయి. స్వీయభక్తి మార్గానికి సంబంధించిన కవులలో ప్రేమ రూపమైన భక్తి ప్రధానమైంది. దక్షిణ దేశంలోని నయనార్లు, ఆళ్వార్లు స్వీయభక్తి మార్గంలో మొదటివారు. వీరిలో విభిన్న కులాలకు సంబంధించిన వారున్నారు. స్వీయభక్తి మార్గం ప్రత్యక్షంగా కుల నిరసన చేయలేకపోయినా పరోక్షంగా కులాన్ని త్రోసిపుచ్చింది. భక్తి క్షేత్రంలో కుల భేదాన్ని భక్తికవులు తిరస్కరించారు. వీరిలో - కృష్ణమాచార్యులు, అన్నమయ్య, కంచెర్ల గోపన్న, త్యాగయ్య, వీరబ్రహ్మం మొదలైనవారు. వీరు తెలుగు భాషలో శుద్ధ భక్తిమార్గానికి మార్గదర్శకులుగా నిలిచిన వారు. "హరి భక్తిలేని విద్వాంసుని కంటెను, హరికీర్తనలను సేయునతడే కులజుండు, శ్వశచుండైన నేమి (చండాలుడు) ఏ వర్ణంబైననేమి? ద్విజునికంటెవాడె కులజుండు" అని కృష్ణమాచార్యులు బోధించాడు. అట్లాగే - "మెండైన బ్రాహ్మణుడు - మెట్టు భూమి యొకటే, చండాలుడుండేటి సరిభూమి ఒకటే", "పరమగు వేదాల పఠన దొరకియు సదా హరిదలచలేని సన్యాసి కంటే, మరగి పసురము దినెడి మాలయైనను వాడె పరమాత్మ గొలచినను బ్రాహ్మణోత్తముడు" అని అన్నమయ్య కులభేదాలను నిరసించాడు. ఈ ఇద్దరు కవులు వైష్ణవ భక్తులే!

పురుషోత్తము చౌధరీకి ఈ సాహిత్య ధోరణులతో పరిచయముంది. భాగవతాన్ని ఆమూలాగ్రంగా అధ్యయనం చేసినవాడు కాబట్టి అందులోనుంచి సరిపడిన భాగాలను

పరిగ్రహించి కులవ్యవస్థను దుయ్యబట్టాడు. "బ్రహ్మ తన ముఖమువల్ల బ్రాహ్మణులను, భుజము వల్ల క్షత్రియులను, తొడలవల్ల వైశ్యులను, పాదముల వల్ల శూద్రులను సృష్టించెనని భాగవతము మొదలగు పురాణములయందు వ్రాయబడి యున్నదని చెప్పుచున్నారు..." అలాంటప్పుడు బ్రహ్మ ఏ కులానికి చెందినవాడు అని ప్రశ్నిస్తాడు. ఈ సందర్భంలో ఈ వ్యాఖ్యలున్న పుస్తకాన్ని చదివితే అవి ఎంత ఘాటుగా ఉంటాయో తెలుస్తుంది! వీటికి తోడు వేమన పద్యాలను ఉటంకించి తాను చేసిన వ్యాఖ్యలు మరింత వేడిగా వాడిగా ఉంటాయి.

జన్మ వృత్తాంతాలనే కాకుండా భోజన పానాదుల విషయంలో కూడా దోషారోపణ చేశాడు.

"మాల మాంసముదిను మరి సర్వజనులెల్ల కొవ్వుదిందు వేరొక్క కులముగాదె! కులము లెల్ల నొక్క కులమనె తెలియుడి! విశ్వదాభిరామ వినురవేమా"!

కుల భేదాలు లేవు – అని భోదించిన వేమన పద్యాల ప్రభావం చౌధరి గారి మీద చెరగని ముద్రవేసింది. చౌధరిగారు బళ్లారి వెళ్లినప్పుడు ఈ పద్యాలను విని ఉండవచ్చు. ఆ మాటకొస్తే అన్నమయ్య కూడా రాయలసీమ ప్రాంతానికి చెందినవాడే.

"**వజ్రసూచి**" అనే గ్రంథంనుంచి రెండు శ్లోకాలను ఉదహరిస్తూ తన వాదనను పటిష్టంచేసుకొంటారు.

**"సత్యం బ్రహ్మ తపోబ్రహ్మ! బ్రహ్మ చేంద్రియ నిగ్రహ:సర్వభూతే దయ బ్రహ్మ! ఏతీద్రాహ్మ లక్షణం"**

**"సత్యం నాస్తి తపోనాస్తి ! నాస్తి చేంద్రి విగ్ణ సర్వభూతౌ దయానాస్తి ఏతచ్ఛండాల లక్షణం"**

సత్యం తపం, ఇంద్రియ నిగ్రహం, సర్వజీవుల యెడల దయారసం – ఇవి బ్రాహ్మణ లక్షణాలు ఇవి లేనివారు చండాలురని అర్థం.

చౌధరి గారి ప్రబోధంలో ఉన్న విశిష్టతను పరిశీలించాలి. కులాన్ని, అందుకు సంబంధించిన ఆచార కర్మకాండను అంతగా నిరసించిన కవి. వారు– "మీ కులాచార దుష్టక్రియలను విడిచిపెట్టి యధార్థముగా దేవుని సంబంధులై యుండగలందులకు జగద్రక్షకుడైన యేసుక్రీస్తు నందు విశ్వాసులు కండి." ఈ నాలుగుమాటల్లో క్రైస్తవ ప్రేషితోద్యమ సూత్రాన్ని పొందుపర్చారు. వర్ణవ్యవస్థ వలన అవర్ణమైన మానవ జీవితానికి ఏకైక లక్ష్యం యేసు; యేసు బోధలు, యేసు మహితోక్తులు. క్రీస్తు మాటలకు చౌధరీగారు తన కవితా ప్రజ్ఞతో పరిమళాన్నీ, సంకీర్తనలకు నాట్యాన్ని ఆపాదించి, భక్తికీ, ముక్తికీ యేసు ఆధారం

అని నిస్సంకోచంగా ప్రకటించారు. "యేసుక్రీస్తు అను సూర్యోదయమాయెను.. ఆ వెలుగులో నడిచేవారికి ఎంతో సౌఖ్యము కలుగునో తెలుసుకొనగలరు. జనులారా పాపమనే నిద్రను విడిచి లెండి" యేసు రక్షణ పరిధిలోకి ఆహ్వానించే ఈ పలుకులు - "మిత్రో జనాన్ చేతయతే' (సూర్యుడు జనాన్ని మేల్కొలుపుతున్నాడు) అనే వేద ఋక్కును జ్ఞాపకం చేస్తున్నాయి. పాపాంధకారాన్ని పటాపంచలు చేసి, ప్రజల్ని తమస్సు నుంచి ఉషస్సులోకి పయనింప చేసేవాడు యేసుక్రీస్తు. నిద్రావస్థలో నున్న వీరిని చైతన్యవంతులుగా చేయువాడు యేసు. ఈ వాక్యంలో ఉన్న రెండు పదాలకు అర్థం చెప్పుకోవాలి. నిద్ర - అంటే సగం మృత్యువు. అటువంటి అవస్తనుంచి జాగృతం చెయ్యాలంటే అది చైతన్యమూర్తికే సాధ్యమవుతుంది. చైతన్యమనే శబ్దం 'చిత్ సంజ్ఞానే' అనే వ్యుత్పత్తి నుంచి జన్మించిన పదం. చైతన్యమంటే జ్ఞానం. వేదాల గ్రంథాలలో చైతన్యమంటే 'అపంచీకృత జ్ఞానం.' అంటే ఇంద్రియాల చేత కప్పబడనది అని అర్థం. అది - పరబ్రహ్మస్వరూపం. మరింత వివరంగా చెప్పాలంటే - చైతన్యమంటే దివ్యశక్తి, ఆధ్యాత్మిక స్ఫూర్తి, పరమజ్ఞానం, బ్రహ్మజ్ఞానం. ఇంతటి మహత్తుగల చైతన్యమూర్తి యేసుక్రీస్తే అని చౌధరీగారు విశ్వసించారు. మనుష్యులలో రెండు జాతులు మాత్రమే కలవు - అంటూ వీరు ఇలా విశ్లేషించారు: "దేవుని మాట నమ్మి క్రీస్తునందు విశ్వసించిన వారందరు మోక్షమునకు వెళ్ళుదురు. అది దైవజాతి. రెండవది - కులాభిమానమును పాపమును విడువని వీరందరు నరకాగ్నిలో త్రోయబడుదురు. అది సాతాను కులమనబడును. అంతేగాని మరేజాతి భేదములు మనుష్యులలో లేవు." (కులాచార పరీక్ష). అటు లౌకిక జీవిత శ్రేష్టత్వాన్ని, ఇటు ఆధ్యాత్మిక జీవిత ఔన్నత్యాన్నీ కలిపేది 'విశ్వాసం' అని చౌధరీ గారి దృఢ నమ్మకం. ప్రాతస్తరమునకు చెందిన ఒక కీర్తనలో ఈ భావన ఇలా వెలువడింది : "భాను డుదయం బయ్యెన్ బద్మములు వికసిల్లె - గానములు జేసె బక్షుల్ - మానసాబ్జము లలర - మనము కల్వరి మెట్ట - పై నెక్కు నినుండనెడి ప్రభుజూచి వేడ్కన్ ... తెల్లవారిన వేళ .. (ఆం.క్రై.కీ. 42).

యేసుకు 'నీతి సూర్యుడు' అనే బిరుదు ఉంది. ఆయన ఉదయించినప్పుడు పద్మములు (పంకజములు అనే పేరుకూడా ఉంది. బురదలో పుట్టినవి అని అర్థం) బురదయినా, బుద్బుద ప్రాయమైనా నీతి సూర్యుని కిరణాలు సోకినంతనే అవి మనస్సులో చొచ్చుకుపోయి మనస్సును వికసింపజేస్తాయని 'మనసాబ్జములలర..." అని అంతర్గత మనోవికాసాన్ని ప్రదీప్తం చేశారు. అది - కల్వరి కొండనెక్కి సిలువపై వ్రేలాడుతూ, పాపపరిహారం చేస్తున్న యేసును తిలకించడానికి మనకు మరో 'తెల్లవారిన వేళ' ప్రసాదితమయిందని వీరి వింగడింపు.

ఈ సందర్భంలోనే సంస్కరణకు సంబంధించిన ఒక విషయాన్ని స్పష్టం చెయ్యాలి. పురుషోత్తము చౌధరీగారి సమకాలంలో వచ్చిన భక్తి ఉద్యమాలకు యూరోపులో ఉద్భవించిన ప్రొటెస్టాంటిజానికి పోలికలున్నాయి. ఏనుగుల వీరాస్వామి గారి 'కాశీయాత్ర చరిత్ర' చదివితే ఇది బోధపడుతుంది. ప్రొటెస్టాంటిజం మొదలైన కాలానికి భక్తి ఉద్యమం భారతదేశం అంతటా వ్యాపించింది. దీని ప్రభావంవల్ల సాధారణ భాష, సాహిత్యాలు ప్రచారంలోకి వచ్చాయి. సాహిత్య రంగంలో ఇదొక మలుపు అని చెప్పవచ్చు. అంతకు ముందే తమిళ దేశంలో ఇది ప్రారంభమైందన్న విషయాన్ని మర్చిపోరాదు. వైదిక కర్మకాండలు, పురోహిత వర్గం ఆధిక్యత, విగ్రహారాధన, అగ్రకులాలలో నిరంకుశత్వం, ఛాందసత్వం, మత మౌఢ్యం, వర్గ విధానం, కులాలు – వీటికి వ్యతిరేకంగా పోరాడారు. ఇందులో నిమ్న వర్గాల కవులు, మహమ్మదీయ కవులు కులమత భేదాలు లేకుండా కలం పట్టారు. తత్త్వకవులు, భక్తికవులు, విగ్రహారాధనను నిరాకరించారు. అన్నమయ్య, వేమన, వీరబ్రహ్మం మొదలయిన కవులు, మతంలో ఆధిపత్య వ్యవస్థ శిథిలాలలో నూతన వ్యవస్థ ఆవిర్భావానికి మార్గదర్శకులయ్యారు. కాని వీరిలో నిర్మాణాత్మకత లేదు అని పండితులు అభిప్రాయపడతారు. ఆ కొరతను **"విగ్రహనిర్మాణం"**లో పురుషోత్తము చౌధరి గారు తీర్చారు. ఇది 1847లో లిఖితమైంది.

**"ఇదేమి వెఱ్ఱి, యేమి వెఱ్ఱి – యీ నరాలి కయ్యయో"**.. అంటూ విగ్రహారాధనాన్ని ఖండిస్తూ.. విగ్రహాలు మానవ నిర్మితాలనీ, అవి నిర్జీవులనీ, పలకని ఉలకని స్పందనలేని రంగు బొమ్మలని వీటిని పూజించడం, వీటిని సేవించడం వెఱ్ఱి అని వాదిస్తారు. దేవతా విగ్రహాన్ని ఎలా నిర్మిస్తారో వీళ్ళు పడే అవస్థలు ఎలాంటివో కళ్ళకు కట్టినట్లుగా మొదటి పాఠంలో వివరించారు.

**"నరుండు గొడ్డలిన్ కరంబునన్ ధరించి బోయి యా యరణ్యమందు చెట్టుగొట్టి...**
**వేల్పుజేయ వడ్లవాని బిల్చునో....**
**అలాటి కొయ్యబొమ్మ కక్షులాననంబు జక్కగా నలంకరించి రంగు వేయు మయ్యా...**
**కూలి దాని కిత్తునందురో...**

**"గుడ్లగూబ మోమువంటి మోము దంబపొంతియే మరే పోగానరాదు వేపమొద్దు..**
**జగత్తునాథుడంచు జెప్ప జాల సిగ్గుకాదకో....**

జగత్తుకు నాథుడని కొలిచే విగ్రహం కేవలం మానవ హస్తకృతం అనీ, అది వేపమొద్దు, దానికి మొక్కడం వెఱ్ఱి అని చౌధరీగారు బోధించారు. ఆ విగ్రహం అనిచితమయిందనీ, నిర్జీవి అనీ, పూజకు పునస్కారానికి అనర్హం అనీ ఆ "భ్రమ వీడరా" అంటూ చెప్పిన

మాటలు జ్ఞానోదయాన్ని కలిగిస్తాయి.

1. "ముక్కు చెక్కుట వెట్టిరా - యది - మూర్కొనంగా జాలదు...
2. కన్నులున్నవి గాని లోకుల - గంచు తీరిక లేదురా..
3. నోరు చెక్కెను గాని నికయే - నూరుగొట్టిన పల్కదు..
4. చెవులు లేవుర దీనిలో నొక - చిన్నయైనను గానము... ...
5. జెబ్బలున్నవి దాని కిక నర - చేతులేమై పోయెనో..
6..... వేపకఱ్ఱ నిబద్ధిరా నొక - వ్రేలెడైనా యెదుగదు...

ఇది చదివాక వివేకవంతుడు అడిగే ప్రశ్నలకు నిజమైన దేవుడు ఎవరు? ఆయన లక్షణాలేమిటో "పంచరత్నములు" అనే అయిదు సీసపద్యాలలో వివరిస్తారు. ఈ పంచరత్నమలు కంఠస్థం చెయ్యదగినవి. ప్రతి సీసపద్యం కడన ఒక వృత్తం ఉండాలన్న నియమాన్ని పాటిస్తూ, ఆ వృత్తాలకు మహత్తరమైన మకుటాన్ని కూర్చారు. అది : "**ఘనుడగు యోహోవా దిక్కు నా కనుదినంబున**". యెహోవా - అనేది హెబ్రీయ పదం; ప్రభువులకు ప్రభువు; దేవాది దేవుడు - అని అర్థం. "**దేవుని విరాడ్రూప వర్ణనము**" అనే కావ్యం (దైవ కుమార వర్ణనము) వీటిలో నిజమైన దేవుని శక్తి ప్రభావాలనూ, మహత్మ్యాన్ని, మనస్తత్వ వివరననూ రమణీయంగా వర్ణించారు. కవికి ఉన్న మతదృష్టికి, సాహిత్యదృష్టికి, భాషాశాస్త్ర దృష్టికి ఇవి అద్దంపట్టే పద్యరత్నావళి ... క్రైస్తవ సాహిత్య సంప్రదాయ స్రవంతిలో పరవళ్ళుద్రొక్కే పద్య కుసుమాలు. ఇందులోని వర్ణనలు విషయాను గుణ్యములై, సందర్భోచితంగా ఉన్నాయి. ఉదహరణగా కొన్ని పద్య భాగాలను పేర్కొనక తప్పదు.

దేవుని మహత్తును ఆయన విశ్వరూపాన్ని వివరిస్తూ;

ఎవ్వడు తన జేన నిమిడించి కొలుచు నీ ఆకాశ మండలం బద్భుతముగ.

ఎవ్వని చేతిలో నీ విశ్వమంతయు నాటల పూబంతి యట్టులుండు

ఎవ్వని యొడిగట్ట నీ తారలన్నియు మల్లె మొగ్గలరీతి గిల్లబడును...

అఖిల లోకముల వృత్తాంత మాద్యంతంబు ఎవ్వని పటమునందీ పాడియయ్యుండు సకలంతరాత్మల సాక్షియై యెవరు కారణ కార్యభావనల్ గణన సేయు..... తండ్రి తనయుండు విమ లాత్మ తానె యగుచు నాణెముగ దీని శక్తి బృందముల బ్రోచు నెవడో యాతడెనా తండ్రి యిష్టుడైన ఘనుడగు యెహోవాదిక్కు నా కనుదినంబు.

ఈ పద్యాలలో క్లిష్టమైన సంస్కృత పదాడంబరం లేదు. ప్రతి ఒక్కరు అర్థం చేసుకొనే సులువైన భాష.

ఇందులో గమనించతగ్గ మరో ముఖ్యమైన విషయముంది. అది వేదాంత పరమైన సైద్ధాంతిక ప్రమాణం. "తండ్రి, తనయుండు, విమలాత్మ తానే యగుచు" – ఇది త్రిత్వ సిద్ధాంతం. విగ్రహ నిర్మాణంలో – పంచరత్నములు అనే అయిదు సీస పద్యాలలో తండ్రియైన యెహోవా గుణగణాదులను వివరించారు. దేవుని విరాడ్రూప వర్ణనములో కుమారుడైన యేసుక్రీస్తును గురించి "... యేసుక్రీస్తు పృథ్వి నవతార మెత్తిన విశ్వరూపయని విరాడ్రూపయని నొక్కడతడె గాక, యితర వేల్పులకే పేరులివ్వదగదు" – అని యేసుక్రీస్తుని అభివర్ణిస్తారు. ఈ వరుసక్రమంలో పరిశుద్ధాత్మ స్వభావాన్ని గురించి కూడా ఏదో ఒక పేరు మీద విడిగా వర్ణించి ఉండాలి. లేక పోతే 'విమలాత్మ తానె' అని త్రిత్వాన్ని పేర్కొన్న సిద్ధాంతం సంపూర్ణం కాదు. ఈ విషయాన్ని ఎక్కడా, ఎవరూ ప్రస్తావించలేదు. కనీసం 'అలభ్య పుస్తకాల' జాబితాలోకూడా చేర్చలేదు. అంటే ఇది పూర్తిగా మరుగున పడిపోయిందన్న మాట. అలాకాదు, చౌధరీగారు 'తండ్రి కుమారుల'కే అధిక ప్రాధాన్యతనిచ్చారు; పరిశుద్ధాత్మను గురించి సందర్భానుచితంగా పేర్కొన్నారే గాని ప్రత్యక్షంగా ఏ కావ్యం వ్రాయలేదు అనడానికి వీల్లేదు. ఆదిలో చౌధరీగారు వ్రాసిన ఒక కీర్తన ఇందుకు నిదర్శనం.

**"... ఘనముగా విమలాత్మ! చనుదెంచె వీరిపై"**

**"... పరమండలము నుండి వచ్చెను.."**

**"పరిశుద్ధాత్మ చేతను నింపబడిరంత...**

**ఆత్మ ప్రేరణము జేయుజాడను – ధారాళముగ భాషాంతరము లాడిరి....**

పరిశుద్ధాత్మ ఆగమనాన్ని గురించీ, తదుపరి పరిశుద్ధాత్మ చర్యల గురించీ చౌధరీగారు ఈ కీర్తనలో వివరించారు. అంటే – పరిశుద్ధాత్మ త్రిత్వంలో ఉన్న దైవీకస్థానాన్ని విస్మరించకుండా దీన్ని సముచిత స్థాయిలో వెల్లడించారు. అలాంటప్పుడు – పరిశుద్ధాత్మ మీద ప్రత్యేక కావ్యం వ్రాసి ఉండితీరాలి. అది మనకు తెలియని 'అలభ్య'కావ్యంగా మిగిలిపోయిందని నా అభిప్రాయం. చౌధరీగారు వ్రాసిన మరో స్తుతి కీర్తనలలో కూడా త్రిత్వం ప్రస్ఫుటమయింది. "వందనమే యేసునకు.." అనే కీర్తనలో – యెహోవా తనయునకు – ఇమ్మానుయేలునకు (యేసునామధేయం)...

"మరియ తనూజునకు – మహిమ గంభీరునకు (యేసు) విమలాత్మ పూర్ణునకు" (ఆం.క్రై.కీ. 74) త్రిత్వ సిద్ధాంతం ఇందులో అంతర్లీనం.

నిజానికి అలాంటి కావ్యమే లిఖితమై ఉంటే, అది మనకు లభించితే, సిద్ధాంత పరమైన వ్యాఖ్యలకూ, చౌధరీగారి భాష్యానికీ సంపూర్ణమైన చిత్తరువు లభించి ఉండేది. దేవుని

విరాడ్రూప వర్ణనంలో దైవకుమార వర్ణనం యేసు విశ్వరూపాన్ని వివరించేదిగా ఉంది.

"ఆకాశమవ్వలి యాకాశము మీద యాకాశము మీద నతని శిరము క్రింది లోకము నేల క్రింది లోకంబులంటి క్రిందనుండు వాని పాదములు దిక్కులన్నియు సర్వదిక్కులన్నియు బాహూవులు చాచి కౌగిట నునుచునతడు..."

ఇలా సాగిన వర్ణనలో చౌధరీగారి దర్శన ప్రతిభతో పాటు వారి వచనా చైతన్యాన్ని ఆవిష్కరింపజేసుకొన్నారు.

"పరమ పురుషుడు సర్వాధిపతి విశుద్ధ సుస్వభావుడు ఘనవిరాట స్వరూరపుడీతడొక మారు తన నామ మెరుకజేసె.. నహహ యీ పేరు యేసుక్రీస్తనగ బరగె పృధ్వినవతారమెత్తిన విశ్వరూపియన విరాడ్రూపియన నొక్కడతడెగాక ఇతర వేల్పులకీ పేరు లివ్వదగదు".

ఇంత ఘనంగా, అద్భుతంగా యేసుని విశ్వరూపాన్ని వర్ణించిన కవులు లేరేమోననిపిస్తుంది. క్రైస్తవ సాహిత్యంలో అధిక భాగం యేసు మూర్తిమత్వాన్ని అతి సౌమ్యంగా, ఆయన మహత్మ్యాన్ని అతి దీనంగా చిత్రించడం జరిగింది. సహనశీలతకు మారు పేరుగా, కరుణా సముద్రుడనీ, అవధులులేని ప్రేమకు ప్రతీకగా యేసును అభివర్ణించారు. అది సబబే. కాని – దేశీయుత కవితా సంప్రసిద్ధమైన సమోన్నత స్థానాన్ని ఆవలి వైపునున్న విరాడ్రూపాన్ని బహుశా మరోకవి ఊహించని విధంగా సర్వతోముఖ ప్రజ్ఞాధురీణుడు, బహుభాషాకోవిదుడు ఐన చౌధరీగారు చిత్రించారు. ఇది వారి విశిష్టత; అది వారికే చెల్లు. విషయం పఠితల హృదయంలో హత్తుకొని పోవాలని సమానార్థకములైన పర్యాయపదాలను పుంఖాను పుంఖాలుగా ప్రయోగించారు. వారి పద్యాలుగానీ, కీర్తనలుగానీ అలంకార భరితాలు. ఒకే అలంకారానికే అనేక విషయాలను జోడించి అలంకార మాలికలుగా అల్లడం వారి కళాత్మక దృష్టికి నిదర్శనం. ఈ రెండు పద్యకావ్యాలు, మనోజ్ఞకళాఖండాలు గతంలో ఎన్ని తరాలవారు వీటిని చదివి ఆ రసగంధను ఆస్వాదించారో లేదో తెలియదు గాని, అయిదో తరానికి చెందిన చౌధరీగారి మనవడు జె.జె. చౌధరిగారు భగీరథ ప్రయత్నమే చేసి వీటిని ఈ తరం వారికి అందించడం ముదావహం అది కేవలం దైవానుగ్రహం.

**హిందూమత ప్రదర్శనము** – మార్పు అనేది అంత తేలికగా అంగీకృతం కాదు. కొన్ని సందర్భాలలో అనివార్యమైన దాన్ని స్వీకరించి ఆచరణలో పెట్టాలంటే సులభసాధ్యం కాదు – ముఖ్యంగా మతపరమైన విషయాలలో ఇది మరింత జటిలమౌతుంది. నూతన మత సత్యాలను ప్రచారం చేయాలంటే దాన్ని వ్యతిరేకించే వారికి పెద్ద మూల్యమే చెల్లించాల్సి

వుంటుంది. పురుషోత్తము చౌధరీ గారికి ఇక్కట్లు తప్పలేదు. బ్రాహ్మణకులం అతన్ని వెలివేసింది; ఇంట్లో ఆదరణ కరువైంది. హిందు మత ప్రదర్శనము, విగ్రహ నిర్మాణములాంటి పుస్తకాలను చదివినవారు వారిని నానారకాలుగా హింసించారు. అనేక సార్లు దెబ్బలు కొట్టారు. భోజనపానాదులు లేకుండా మాడ్చి బాధించారు. ఇన్ని శ్రమలు అనుభవించినప్పటికి తను విశ్వసించిన సత్యధర్మాన్ని పది మందికీ చెప్పకుండా ఉండలేకపోయారు. తప్పుడు ప్రచారాలను నిరసిస్తూ, మతాన్ని ఒక అస్త్రంగా మార్చుకొని సామాన్య ప్రజలను మోసగించే కపట సన్యాసులని, పూజారులని, మతోన్మాదులని, ఎదిరించాడు. ఆ పరిస్థితులలో పురాణాలలో లిఖితమైన విషయాలనే చూపిస్తూ, సంస్కృత శ్లోకాలను వివరిస్తూ, వాటిలోని దోషాలను ప్రజలకు తెలియజేశాడు. ఒక నాటి వైష్ణవ భక్తుడు, నిష్టాగరిష్టుడు, పండితోత్ముడు బహుభాషాకోవిదుడు – విష్ణుస్తోత్రం, శివస్తోత్రం, కృష్ణలీల, దశరథరామ శతకము మొదలయిన భక్తి సాహిత్యాన్ని సృజించి మహాకవి అని, కవి సార్వభౌముడు అని బిరుదులు పొందిన బ్రాహ్మణకవి, పురాణ ప్రభోదాలని హిందుత్వ ప్రచారాన్ని తప్పుపట్టడం అనేది నమ్మలేని నిజం; ఊహకందని పరమసత్యం. ఇంతగా పరివర్తనం చెందడానికి చౌధరీగారు స్వయంగా "హిందూమత ప్రదర్శనము" అనే పుస్తకంలో పరిచయ పలుకులలో యిలా చెప్పుకొన్నారు: ".. ప్రభువైన యేసుక్రీస్తు అనే పరమ సూర్యుడు మా యొక్క ఆత్మాకాశములపైన ప్రకాశించుటవల్ల మా హృదయములు అజ్ఞాన తమస్సు అనే నిద్రనుంచి మేల్కొని మా అంత్ర నేత్రములు తెరువబడెను. దీని వల్ల ఆత్మరక్షణోపాయమును గురించి నిజమైన మతము యేదో, అబద్దపు మతములు యేవో వాటిని బాగా పరీక్ష చేసినాము. ఆ పరీక్షవల్ల నిజమును కనుగొని అంగీకరించుటకును అబద్ధమును కనుగొని వాటిని పరిహరించుటకును తగిన బలమును బొందియున్నాము..." ఇది కేవలం తన విశ్వాసాన్ని సమర్ధించుకోవడమే కాదు. సత్యశోధనలో తను కనుగొన్న పరమ సత్యాన్ని ప్రజలకు తెలియబర్చాలన్నదే చౌధరీగారి ధ్యేయము; అదే వారి తపన.

ఇందులో "**మనస్సేమూలము**", "**మరణము**" అనే రెండు కరపుస్తకాలు కూడా ఉన్నాయి. ఇవి గద్యరూపంలో ఉన్న పుస్తకాలు.

"అచంచలమైన విశ్వాసానికి వెన్నుదండుగా నిలిచేది మనస్సు. భక్తికి మనస్సే మూలం. "దీని స్వభావ గుణములను లెస్సగా శోధించి" చూడాలి అని ఈ పుస్తకాన్ని ప్రారంభిస్తారు. "నీ మనస్సు చెడ్డదా! మంచిదా!" అని ప్రశ్నిస్తారు. ఆ మనసును నిష్కర్షగా పరిశీలిస్తే దాని "వైఖరి' బోధపడుతుందని నాలుగు అంశాలను పేర్కొంటాడు : చెడిన మనస్సు: కపట

మనస్సు; నిలకడలేని మనస్సు: నమ్మశక్యంగాని మనస్సు: ఈ నాలుగు అంశాలకు తగిన కారణాలను పరిష్కారమార్గాలను చూపెడతారు. "నీవు నిజమైన దేవుని విడిచిబెట్టితివి" - ఇది ప్రధాన కారణం. అందువల్ల "నీ మనస్సు ఆరి అగ్నిలేని మసిబొగ్గు వలె తేజోహీనమై సకల కల్మషముల చేత కప్పబడి యున్నది" - అని తేల్చి చెబుతారు. ఈ "మనోమాలిన్యమును' క్షాళనం చేసే "దేవుని పోలిన ఒక మధ్యవర్తి నీకు ఉంటేనే గాని లేకుంటే నీయంతట నీవే దేవుని యొద్దకు వెళ్లలేవు" అని యేసు క్రీస్తు ప్రశస్తతను, ఆయన ప్రమేయాన్ని గురించి ప్రస్తావిస్తారు. "ప్రభువైన యేసుక్రీస్తు యొద్దకు వెళ్ళుటకు ఆలస్యము సేయక త్వరగా లేచి మనస్సు మార్చుకొని రక్షణభాగ్యమును వెతికి పుచ్చుకొనుము" - అని పాఠకులను ఆహ్వానిస్తారు.

**మరణము** - అనే పుస్తకంలో చౌధరీగారి నిర్దిష్టమైన భావాలు వెల్లడయ్యాయి. **మరణం నిశ్చయము, మరణము భయంకరము, మరణము నుంచి జీవము**; అనే మూడు విషయముల మీద సమగ్రమైన చర్చను కొనసాగిస్తారు. ఇందులో - ఆంధ్ర క్రైస్తవ కీర్తనల పుస్తకంలోనికి ఎక్కని ప్రబోధాత్మకమైన పాట ఒకటి ఉంది. నా చిన్నతనంలో గ్రామ్ ఫోన్ రికార్డులో ఈ పాటను విన్నాను. అది - రచయితను గురించి తెలుసుకోవాలన్న జిజ్ఞాసలేని వయస్సు.

"మాయలోని మాయ సర్వము మాయలోకము మాయరా...

కాయము సౌపాయము ఆదాయమెల్ల మాయరా..

మాయ అనే పదానికి ఉన్న అర్థచ్ఛాయలు : అజ్ఞానం; కపటం; మోసం; భ్రమ. వీటిన్ని నిరసించమని యథార్థాన్ని పరిగ్రహించి యేసుక్రీస్తును విశ్వసించమని ప్రబోధించే కీర్తన.

"ఆశలెల్ల గాలిమూటలట్టుగాకే మబ్బురా యేసు నామామృతము గ్రోలుమిదియే సారంబు.."

**అనువాద సాహిత్యం :**

అనువాదము అనాదిగా వస్తున్న సాహిత్య ప్రక్రియ. క్రీస్తుకు పూర్వము 200 సం... క్రితమే దీని ప్రశస్తతను గుర్తించడం జరిగింది. బబులోను నగరం బహుభాషా నగరంగా వెలుగొందిన నగరం. అనువాదం ప్రాచీనతను ప్రస్తావించాం. గనుక బైబిల్ గ్రంథాన్నే ఆధారంగా పరిశీలిస్తే - "..... హిందూదేశము మొదలుకొని కూషుదేశము వరకు వ్యాపించియున్న నూట ఇరువది యేడు సంస్థానములలోనున్న అధిపతులకును.. దాని

దాని వ్రాతను బట్టియు, దాని దాని భాషను బట్టియు తాకీదులు వ్రాయబడెను" (ఎస్తేరు 8:9) అని ఉంది.

అనువాద సాహిత్యంతోనే తెలుగు సాహిత్యం ప్రారంభమైంది, అనువాద సాహిత్యంతోనే అది ప్రభావితమైందనేది సాహితీ వేత్తలు అందరూ అంగీకరించిన విషయం. తెలుగులో సాహిత్యం అనదగినదంతా అనువాద సాహిత్యమే అని వాదించేవారూ లేకపోలేదు. అనువాదమన్నది తెలుగువారికి క్రొత్తేమికాదు. రామాయణం; భారతం; భాగవతం; వేదాలు; పురాణాలు; ఉపనిషత్తులు - ఇవన్నీ అనువాదితాలే; ఉత్తరదేశం నుంచి దక్షిణ దేశానికి వచ్చిన మతగ్రంథాలు. ఆ రోజుల్లో జరిగిన అనువాదాలు కూడా సంస్కృత భరితాలే !

18, 19వ శతాబ్దులలో వచ్చిన మిషనెరీలు ముందుగా బైబిల్ గ్రంథాన్ని, ఆ తరువాత యేసుక్రీస్తు జీవితానికి సంబంధించిన కొన్ని కరపత్రాలను, పుస్తకాలను, కీర్తనలను అనువాదం చేశారు. విలియం కేరీ (కలకత్తా), జాన్ హే, డాసస్ ఉత్తరాంధ్రాలో పని చేసిన కొంత మంది మిషనేరీలు తామే స్వయంగా తెలుగులో గ్రంథ రచన చేశారు. అలాగే అనువాదం కూడా చేశారు. అయితే వాళ్లకు కష్టమైన వాటిని, మత, సంస్కృతి పరమైన వ్యాఖ్యలున్న పుస్తకాలను, కరపత్రాలను ఆయా భాషల్లో ప్రావీణ్యమున్న వారిచేత అనువాదం చేయించారు. అలాంటి వారిలో పురుషోత్తము చౌధరీగారు ఒకరు. ఇక్కడే ఒకమాట చెప్పుకోవాలి. చౌధరీ గారికి ఇంగ్లీషు భాష రాదు! అందుకే - ఒకరు తన దగ్గర ఉండి ఇంగ్లీషులో ఉన్న విషయాన్ని చదివి దాన్ని వివరిస్తూ వుంటే వారు అనువాదం చేశారట! ఇలా చెయ్యడం మరీ కష్టం. తనకు వివరించిన విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి; ఆ తరువాత భావం వక్రీభవించకుండా అనువదించాలి.

అనువాదానికి అప్పటికే ప్రాచుర్యముంది. క్రమపద్ధతిలో నిర్వచనాలివ్వడం, వర్గాలుగా విభజించడం జరిగింది. సంప్రదాయక లక్షణాలు; ఆధునిక లక్షణాలు అని ప్రధానంగా రెండు వర్గాలుగా విభజించారు. చౌధరీగారి అనువాద సాహిత్యంలో ఈ రెండు వర్గాలు కన్పిస్తాయి. మూల భాషలోని విషయాన్ని సంపూర్ణ అర్థాన్ని అందించే విధంగా లక్ష్య భాషలోకి (తెలుగులోకి) అనువదించడం; మూల భాషలోని విషయాన్ని లక్ష్య భాషలోకి వివిధ స్థాయిలో సమానార్థాన్ని బోధించే విధంగా అనువదించడం - అనునవి రెండు వర్గాలు. ఇందులో కూడా - నిర్దేశాత్మక; భావనాత్మక; సందర్భాత్మక; అధిభాషాత్మక; ఆదేశాత్మక - ఇత్యాది భావాలను లక్ష్య భాషలో సమకూర్చడం. ఇవన్నీ చౌధరీగారి అనువాద సాహిత్యంలో కనిపించటం విస్మయాన్ని కలిగించింది. అంతేకాదు, అనువాదంలో కొన్ని

రకాలు, కొన్ని పద్ధతులు ఉన్నాయి. స్థూలంగా పరిశీలిస్తే - సంపూర్ణానువాదం; సాక్షికానువాదం; అపరిమితానువాదం; స్వతంత్రానువాదం; పదపదానువాదం - అనే పద్ధతులు అనువాదాలకు ఆధారంగా ఉంటాయని క్యాట్‌ఫోర్డ్; నైడా మొదలైన పండితులు శాస్త్రీయ దృక్పథంతో వర్గీకరించారు. అనువాద సిద్ధాంతానికి శ్రీకారం చుట్టినవారు ఎటిన్ డోలెట్ (1507-1546) కాని ఈ సిద్ధాంతాన్ని మరింత విశ్లేషించి ఒక రూప కల్పనచేసి నియమాలను ఏర్పర్చడం 1945 నుంచే జరిగిందని చెప్పాలి. అందుకు విశేషంగా కృషిచేసిన వారిలో నైడా; క్యాట్‌ఫోర్డ్; డార్బెల్‌నెట్; మౌనినీ ముఖ్యులు. పురుషోత్తము చౌధరీగారు 1860లోనే అనువాద సాహిత్యాన్ని పరిశీలించిన తరువాతనే సైద్ధాంతికులు నియమాలను ఏర్పరచి ఉంటారని నా భావం. అనువాద సాహిత్యాభివృద్ధికి చౌధరీగారు కృషి చెయ్యడమే కాకుండా మార్గదర్శకుడు కూడా అయ్యాడన్నమాట.

చౌధరీగారు అనువదించిన పుస్తకాల్లో విలియం కేరీ గారు వ్రాసిన పుస్తకాలు, కరపత్రాలు ఉన్నాయి. ఇటీవల లభించిన పుస్తకం - **అంధకార నాశనము.** దీనికి ఆంగ్లమాతృక : Darkness Dispelled 1861లో డబ్ల్యు. బెరీ యాజమాన్యంలో విశాఖపట్టణంలో నున్న లండన్ మిషన్ ప్రెస్‌లో ఇది ముద్రితమైంది.

దైవజ్ఞానం పట్ల సరైన అవగాహన లేకపోవడం; దేవుడు అంటే ఎవరు? ఆయన ఉనికి ఎలాంటిది? ఆయన లక్షణాలు ఎలాంటివి? సృష్టికి ముఖ్యంగా మానవులకు ఆయనకు ఉన్న సంబంధ బాంధవ్యాలు ఎలాంటివి? అంతటి మహత్తర శక్తిగల దైవాన్ని తెలుసుకొనేదెలా? వీటికి సంబంధించిన విషయాలపట్ల పరిశీలనాత్మకమైన సమ్యక్ దృష్టి లేకపోవడం; దేవుడు అనేసరికి భయాక్రాంతులై ఏది కనబడితే దానికి దండం పెట్టి పూజించడం, విగ్రహాలకు నైవేద్యాలు పెడుతూ పూజలు పునస్కారాలు జరిపించడం; మూఢనమ్మకాలకు లొంగిపోయి జీవిత గమ్యాన్ని అగమ్యగోచరంగా మార్చుకోవడం - ఆధ్యాత్మిక అంధకారం అని రచయిత అభిప్రాయం. ఇదొక అవ్యక్తమైన భ్రాంతి; భ్రమజన్యరూపం; చాక్షువ భ్రాంతి. ఈ తత్వానికి గురైనవారు అంధకార బంధురమైన జగతిలో యథార్థమార్గాన్ని తెలుసుకోలేక నిజమైన దేవుడు ఎలాంటివాడో ఎరుగక దారితప్పి తిరుగాడేవాడని, అలాంటి వారి అంధకారాన్ని 'నాశనము'ను, - తొలగించి, దివ్య చక్షువులు ప్రసాదించే ధర్మోపన్యాసమే అంధకార నాశనము. మూలంలో విలియం కేరి సోదాహరణగా ఈ అంశాన్ని వివరించాడు. లక్ష్యభాషలోకి చౌధరీగారు పదపదాను వాదం చెయ్యకుండా, భావనాత్మక స్థాయిలో సంపూర్ణానువాదం చేశారు. భాషా శైలి సహజంగాను సరళంగాను ఉన్నాయి. ఒక్కసారి

చదివితే బోధపడే విధంగా భావవ్యక్తీకరణం జరిగింది. ఇరవై ఐదు పుటల్లో బైబిల్ గ్రంథధర్మ ప్రబోధాన్ని స్వయంగా సిద్ధం చేశారు. అల్లకల్లోలితమైన మానవ జాతికి మనశ్శాంతిని ప్రసాదించేవాడు యేసుక్రీస్తు; పాపాంధకారంలో కొట్టుమిట్టాడే ప్రజలకు పాపక్షమాపణ నను గ్రహించువాడు యేసుక్రీస్తు. "ప్రభువైన యేసుక్రీస్తు యందు విశ్వాసముంచి ఎవరు పరిశుద్ధతగా నడుతురో వారికి అప్పుడు ఆయన శాశ్వతమైన మహిమ కలుగజేయును" అని యేసుక్రీస్తు ద్వారా సర్వప్రజలకు లభించే శాశ్వతానందాన్ని గురించి ప్రస్తావించారు.

మరో అయిదు అనువాదితాలైన పుస్తకాలు లభించాయి. **"జగన్నాథపరీక్ష"** అనేది వాటిలో ముఖ్యమైంది. ఇదికూడా 1861లోనే అచ్చయింది. డబ్ల్యు. బెరీ యాజమాన్యంలో విశాఖపట్టణంలో ఉన్న లండన్ మిషన్ ప్రెస్ నుండి వెలువడింది. అయితే ఆంగ్లంలో దీన్ని ఎవరు వ్రాసారో పేర్కొనలేదు. కాని – ఇందులోని విషయ ప్రస్తావనను పరిశీలిస్తే ఇది కూడా విలియం కేరీ వ్రాసిందేమోనని అనిపిస్తుంది. భావజాలాన్ని, పదజాలాన్ని పరిశీలించితే వీటిలో భావస్వారూప్యం కన్పిస్తుంది. ఈ క్రింద ఉదహరించిన వాక్యం రెండు పుస్తకాలలోనూ కన్పిస్తుంది; ".... దేవుని ఆజ్ఞచొప్పున న్యాయముగానున్న, సత్యముగానున్న, భక్తిగానున్న యీ లోకమందు నడుచుకొందురు. ఈ లోకమందు అసహ్యపడి పాపమును విడచి ప్రభువైన యేసు యొక్క మరణపుణ్యము ద్వారా పాపక్షమము పొంది..." ఇలా సాగిపోతుంది. కనుక ఈ పుస్తకాన్ని కూడా కేరీ గారే వ్రాసారని అనుకోవచ్చు. అయితే – ఇందులో ఏది మొదటి లిఖితమైందో చెప్పడం కష్టం. "జగన్నాథపరీక్ష"లో విగ్రహపూజను నిశితంగా నిరసించడం జరిగింది. అట్లాగే – పురాణాలలో వివరించిన "నారాయణమూర్తి" అవతారాలను పేర్కొంటూ ప్రజల గుడ్డి నమ్మకాన్ని విచక్షణారహిత విశ్వాసాన్ని ప్రశ్నించడం జరిగింది. మత్స్య పురాణములోని ఉదంతాలను సూచిస్తూ, సందర్భానుచితంగా సంస్కృత శ్లోకాలను ఉటంకిస్తూ, జగన్నాథుని భోగలాలసత్వ జీవితాన్ని చూపెడుతూ అలాంటి వారిని పూజించడం, దేవుడని భావించడం సమంజసం కాదని వాదిస్తారు.

ఈ పుస్తకంలో విగ్రహాల ఊరేగింపుకు సంబంధించిన తంతు ఉంది. ఇందులో వర్ణించిన జగన్నాథుని విగ్రహస్వరూపు; "... బొమ్మకు గుండ్రని పెద్దకండ్లున్ను పిట్టముక్కువంటి ముక్కువున్నవి; అందువల్ల దాని ముఖము గుడ్లగూబ ముఖము వలె అగుపిస్తుంది." ఆ తరువాత రథోత్సవానికి సంబంధించిన వివరణ ఉంది. ఈ ఉదంతము యథాతథంగా చౌధరిగారు వ్రాసిన "విగ్రహనిర్మాణము'లో ఉంది. కేరీ గారి పుస్తకంలో ముప్పయి వాక్యాలకుపైగా విగ్రహవర్ణన, ఊరేగింపుల ఉదంతం ఉంటే, చౌధరీగారి పుస్తకంలో సుమారు

అరవై వాక్యాలలో విస్తృతమైన వర్ణన కన్పిస్తుంది. "విగ్రహనిర్మాణము" చౌధరీ గారు 1847 లో వ్రాశారు. జగన్నాథ రథోత్సవము జరిగే పూరీజగన్నాథంకి అతిచేరువలో చౌధరీగారు ఉండేవారు గనుక అన్ని విషయాలు సవిస్తరంగా తెలుసు. తాను కళ్లారా చూసిన సంగతులను అక్షరబద్ధం చేశారు. కేరీగారు వ్రాశారు అని భావించే **"జగన్నాథపరీక్ష"** 1861లో అనువాదితమైన పుస్తకం అచ్చయింది. **విగ్రహనిర్మాణం - పద్యకావ్యం; పంచరత్నాలు -** అనే పద్యాలు, చౌధరీగారు వ్రాసిన తొలి క్రైస్తవ సంకీర్తనా సాహిత్యం ఇందులో ఉన్నాయి. వివరణ కోసం అక్కడక్కడా కొన్ని వచనాలను వ్రాయడం జరిగింది. దీన్ని బట్టి చూస్తే కేరీ గారు వ్రాసిన కరపత్రాన్ని చదివి క్రీస్తును గురించి మరింత విపులంగా తెలుసుకోవాలని చౌధరీగారు విశాఖపట్నం చేరుకున్నారని, అక్కడ మిషనెరీల సాంగత్యం ద్వారా కేరీ గారి సాహిత్యాన్ని మరింత పరిశీలనాత్మకంగా చదివించారని వారు క్రైస్తవ మతాన్ని స్వీకరించడానికి కేరి గారే మార్గదర్శకులని చరిత్ర చెబుతోంది. విగ్రహ పూజను నిరసించే ఈ సాహిత్యాన్ని ఎవరు సృజించారో నిష్కర్షగా తేల్చ లేకపోయినా ఇది చౌధరీగారే సృజించారని భావించడానికి ఆస్కారముంది.

ఆనాటి సమకాలీన, తాత్విక, సాంస్కృతిక, సాంఘీక, మత పరిస్థితులు కూడా యిలాంటి సాహిత్య సృజనకు దోహదం చేశాయి. 1857లో గుజరాతి అయిన స్వామి దయానంద సరస్వతి "ఆర్యసమాజాన్ని" స్థాపించాడు. పంజాబుకు చెందిన లాలా లజపతిరాయ్ దీని నిర్మాణ కార్యక్రమాలను చేపట్టారు. మౌలికమైన వైదిక సంస్కృతే భారతీయ సంస్కృతిగా అనుసరణీయం అని ప్రచారం చేసారు. క్రైస్తవ మత వ్యాప్తిని నిరోధించడమే ప్రథమ కర్తవ్యంగా భావించినప్పటికీ, విగ్రహారాధన ఖండన, స్త్రీ విద్యా, స్త్రీ సమానత్వము మొదలైన సంస్కరణాంశాలు ఉన్నాయి. బెంగాలు ప్రాంతంలో కూడా విగ్రహారాధన్ని నిరసించే ఉద్యమాలు పుట్టుకొచ్చాయి. అలాంటి వాటికి రాజారామ్‌మోహన్‌రాయ్ నాంది పలికాడని చెప్పవచ్చు 1800 నుంచి 1824 వరకు కలకత్తాకు సమీపంలో ఉన్న సిరంపూర్ మిషనెరీలు – విలియం కేరీ, మార్స్‌మన్, వార్డ్ - ఈ ముగ్గురిని "సిరంపూర్ త్రయం" అని ఉదహరించేవారు - వీరితో సహచర్యం చేశాడు. వీరిద్వారా హీబ్రూ, గ్రీకు, ఇంగ్లీషు భాషలు నేర్చుకొన్నాడు. బైబిల్ గ్రంథాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. అట్లాగే సూఫీ, ముస్లిం ఫీలాసఫర్స్ ద్వారా ఖురాన్ని చదివాడు. భౌద్ధమత బిక్షులద్వారా ఆ మత ధర్మాలను పఠించాడు. ఇవన్నీ ముగించుకొన్నాక కలకత్తాలో 1828లో బ్రహ్మసమాజాన్ని స్థాపించాడు. భౌతిక, ఆధ్యాత్మిక, సామాజిక స్థితిగతులను మెరుగుపరచడం తన ధ్యేయంగా చాటించుకొని

అన్ని మతాలవారిని, అన్ని వర్గాలవారిని పిలిచి చర్చలు కొనసాగించేవాడు. సంఘ సంస్కరణోద్యమాలలో బ్రహ్మసమాజము ప్రాముఖ్యమైన పాత్ర వహించింది. కర్మకాండలను, కుల వ్యవస్థను, విగ్రహపూజను ఖండించింది. ఒక క్రైస్తవ మిషనెరీలే కాదు, బ్రహ్మ సమాజం, ఆర్యసమాజం లాంటి ఆధునిక భావాలు ఉన్న సమాజాలు, ఉద్యమాలు విగ్రహపూజను తదితర సామాజిక అసమానతలను తీవ్రంగా నిరసించాయి. ఒకరి భావాల ద్వారా మరొకరు ప్రేరణాత్మక ఉద్దీపాన్ని పొంది సమాజాన్ని ప్రభావితం చేయాలని సమకట్టారు. సమాంతరంగా ప్రవహించిన కాల వాహినిలో అటు హైందవమత సంస్కరణోద్యమాలకు, ఇటు క్రైస్తవ ధర్మ బోధలకు పురుషోత్తము చౌధరీ గారు వారధిలా నిలిచారు. ఈ కోణంలో నుంచి వారి సాహిత్యాన్ని పరిశీలిస్తే మరింత ఉన్నత శిఖరాల మీద వారిని ప్రతిష్ఠించాలి.

**ఇతర అనువాదిత పుస్తకాలు :**

1. **"మసూచిక, విసూచి సంకటములను గురించి కలిగిన భ్రాంతి నివృత్తి".** ఆంగ్ల మాతృక Don the small pox and cholera. దీన్ని వ్రాసిన వారు డబ్ల్యు. గోర్డన్.

2. **"నిజమైన ఆశ్రయము"** The True Refuge. రచయిత : డబ్ల్యు. హెచ్. పియర్స్.

3. **"విశ్వాసము యెవరిమీద నుంచ వలసినదన దాని విచారణ"** In Whom shall we Trust

4. **"వెలుగుకున్ను చీకటికిన్నీ యేమి సాంగత్యము'** What Concord Between Light and Darkness.

ఈ పుస్తక రచయిత పేరు తెలియదు.

ఆనాటి సామాజిక దృక్పథాన్ని ముఖ్యంగా మత మౌఢ్యం, మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, సతీసహగమనం, నానాటికీ పెరిగిపోయే దేవుళ్లు, దేవతల జనాభా పట్ల వెలువడిన నిరసనలకు తన వంతుగా క్రైస్తవ మత ప్రచారకులు స్థానిక సంస్థలలోను ఉద్యమకారులతోను కలిసి సాహిత్యాన్ని సృజించారు. ఇవి ఆలోచనలో, ఆచరణలో, జీవన విధానంలో అన్ని విధాలా సంస్కరణోద్యమాలకు దోహదం చేశాయి. క్రీస్తు ప్రభోదాలకు ప్రభావితులైనవారిలో అన్ని కులాల వారు అన్ని మతాల వారు ఉన్నారు. పురుషోత్తము చౌధరీ, పులిపాక జగన్నాథం లాంటి బ్రాహ్మణోత్తములు సృజించిన సాహిత్యం నూటా డెబ్బయి సంవత్సరాలవరకు సజీవంగా ఉన్నదంటే అందుకు బలమైన కారణాలుండి తీరాలి. క్రీస్తు ప్రభోదాల ప్రభావం, కవుల

ప్రతిభ, వారు ప్రదర్శించిన ధైర్య సాహసాలు, సత్యవర్తనం కోసం వారు శ్రమించిన విధానం, జీవితం పట్ల వైఖరిలో మార్పునాశించి వారు చేసిన ప్రయత్నాలు అమాయక ప్రజలను మతాచారం చేత మోసగించేవారి కుతంత్రాలను, మాయ మాటలను బహిరంగంగా ఖండించి నూతన మార్గాన్ని, శాంతి సందేశాన్ని అందించిన వారి కృషి అందుకు కారణాలుగా చెప్పుకోవచ్చు.

ఈ మేరకు - ఎవరిని నొప్పించకుండా పురాణ గాథల్ని విశ్లేషిస్తూ వొప్పించడానికి చేసిన కృషి, వాడిన భాష హర్షనీయం. పురాణాలను, వర్ణధర్మాలను, మతపరమైన కల్పిత కథలను, మూఢవిశ్వాసాలను, చాంధస మనస్తత్వాన్ని ప్రశ్నిస్తూ వెలువడిన సాహిత్యాన్ని హేతువాద సాహిత్యం అంటున్నారు. చౌధరిగారు చేసిన అనువాదాలలో హేతువాదం పుష్కలంగా కన్పిస్తుంది. ఇదొక గుణాత్మకమైన మార్పు. భవిష్యత్ సమాజానికి శాస్త్రీయ దృక్పథానికి, అభ్యుదయ సాహిత్యానికి పునాదులను వేసింది. ఆచారాల కన్నా ఆలోచనలకు అధిక ప్రాధాన్యతనిస్తూ లోక రక్షకుడైన క్రీస్తులో మానవతా మూర్తిత్వం, ఆధ్యాత్మిక జీవన స్రవంతి లోకానికి వివిధ సాహిత్య ప్రక్రియలద్వారా వెల్లడించిన ఖ్యాతి పురుషోత్తము చౌధరీగారికి దక్కుతుంది.

**ఉపసంహారం**

ఒకప్పుడు అలభ్యాలు అని భావించి వాటి జాడ తెలియక, తెలుసుకొనే పద్ధతులు, మార్గాలు బోధపడక కొన్ని దశాబ్దుల పర్యంతం వాటికోసం అన్వేషిస్తూనే ఉండిపోయాను. ఇంతవరకు పరిశోధనా వ్యాసాలు వ్రాసినవారు చౌధరీగారి జీవిత వృత్తాంతాన్ని పేర్కొంటూ వారి కీర్తనలకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ రచనలు చేశారు. డా॥సుధా రత్నాంజలి సామ్యేల్ గారి చే విరచితమైన "పురుషోత్తమ చౌధరీ జీవితము - రచనలు" అనే పుస్తకములో చౌధరీ గారి శతకాలమీద, కీర్తనల మీద విస్తృతమైన వింగడింపు జరిగింది. ఈ పుస్తకం డా॥సుధా రత్నాంజలి గారి సిద్ధాంత లఘువ్యాసం. కొన్ని నియమ నిబంధనలకు, హద్దులకులోనై సిద్ధాంత వ్యాసాలు వెలువడుతాయి. డా॥గుజ్జర్లమూడి కృపాచారి, డా॥కె.గోపాలకృష్ణారావు, బాబు జాన్ చౌధరీ, డా॥సామ్యుల్ చౌధరీ, డా॥ఆర్.ఆర్. సుందర్‌రావు గారి పుస్తకాలను తథాదిగా వచ్చిన వ్యాసాలను పరిశీలించానని రత్నాంజలిగారు వ్రాసారు. బహుశా విద్వాన్ తిరుక్కోవళ్ళూర్ గారు చౌధరీ గారి మీద వ్రాసిన చరిత్ర గ్రంథం ఆమెకు లభించి ఉండకపోవచ్చు. మొత్తంమీద వారికి లభించిన పుస్తకాలు, కీర్తనలు ఇతర వ్యాసాలను ఆధారం చేసుకొని అమోఘమైన పుస్తకాన్ని రచించారు.

పురుషోత్తము చౌధరీగారికి పర్లాఖిమిడి సంతలో లభ్యమైన సువార్త కరపత్రమును మొదట అందజేసినది వారి అన్నగారైన జగన్నాథ చౌధరీగారు. 150 సంవత్సరముల తరువాత చౌధరిగారి రచనలన్నింటిని సేకరించి ప్రచురించి మనకందించినది కూడా జగన్నాథ చౌధరిగారి ఐదవ తరానికి చెందిన వారి మనవడు శ్రీ జె.జె. చౌధరిగారే.

రెవ. బి.డి.పి. రావు (రాజమండ్రి) గారి కృషిని ప్రస్తావించాలి. ప్రస్తుతం వాడుకలో ఉన్న ఆంధ్రక్రైస్తవ కీర్తనల పుస్తకంలో చౌధరీగారు వ్రాసిన పాటలు డెబ్బయి వరకు ఉన్నాయి. కాని రావుగారి కృషి ఫలితంగా అనావిష్కృతమైన చౌధరీగారి కీర్తనలు మరో వందకి పైగా వెలుగులోకి తెచ్చారు. క్రైస్తవ సంకీర్తనా సాహిత్యాన్ని సుసంపన్నం చెయ్యడానికి ఇవి సంతుష్టమైన సోపానాలుగా ఉపకరిస్తాయి. చౌధరీగారి కీర్తనలన్నింటిని కలిపి ఒక గ్రంథంలో ప్రచురిస్తే ఆధ్యాత్మిక జీవిత పురోభివృద్ధికి సరిపడినంత భక్తి, భావితరాల వారిని ప్రభావితం చేయగలిగిన దృష్టి, సంఘజీవితాన్ని చైతన్య సంపూర్ణం గావించే శక్తి, సామర్థ్యం – చౌధరీగారి కీర్తనలలో దృగ్గోచరమౌతాయి. ప్రతి కీర్తనలోను దైవభక్తిని రంగరించి, "యేసునాథ కథా సుధా రసమిదిగో పానము జేయరే" అంటూ యేసు దివ్య నామామృతాన్ని పాఠకుల మనస్సుల్లో ప్రవహించే రీతిలో ఈ కీర్తనలు వెలిశాయి. సంకీర్తనా సాహిత్యంలో చిరకాలం నిలిచే ఔగంధికం చౌధరీగారి భక్తి సాహిత్యం! ఈ నేల మీద నాలుగు చెరగుల చౌధరీగారి సాహితీ సౌరభాలను వెదజల్లిన వారందరూ అభినందనీయులే అయితే – ఇంకా చేయ్యవలసింది చాలా మిగిలిపోయింది. కాల గర్భంలో ఎన్ని కావ్యాలు కలిసిపొయ్యాయో అంచనా వెయ్యలేం. కాని ఇప్పుడు లభించిన గద్య, పద్య సాహిత్యాన్ని క్రోడీకరించి ఒకే గ్రంథంలా ప్రచురించడం తక్షణ కర్తవ్యం. చౌధరీ గారిది సజీవన సాహిత్యం. శాఖాభేదాలు లేకుండా అన్ని సంఘాలు వారి కీర్తలను నిత్యం పాడుతూ తరిస్తూనే ఉన్నాయి. ఈ మహద్గ్రంథాన్ని ఏ ఒక్క వంశాంకురానికో వదిలి వేయకుండా, సంఘాలన్ని కలిసి సమిష్టిగా ప్రచురించడం బాధ్యతగా స్వీకరించాలి. జీవితానికి, సాహిత్యానికి ఉన్న సహజ సంబంధాన్ని గుర్తించి భావితరాలవారిని జాగృతం చేసే ఈగ్రంథ సంకలనాన్ని చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది. మహనీయులు మనకు మిగిల్చిన సాహితీ సంపదను పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత.

"నేరములెంచకయ్య యిక నీ పదమే గతియంచు జేరితిన్
దూరము జూడకయ్య కడు దు:ఖపయోనిధి నీదుచున్ననన్

సారము జేయుమయ్య యఘవారమునంతయు బాపి నన్ను నీ వారల
గూర్చుమయ్య దృఢభక్తి యుంబుగ యేసునాయక"

దేవుని కరుణా కటాక్షాలను కోరి చౌధరీగారి హృదయాంతరాలలో నుంచి పెల్లుబికి వచ్చిన ఈ పద్యం ఈ గ్రంథానికి ముగింపు కాదు.. ప్రారంభం.